VISALAANDHRA Phone No. 75301 ★★★ Regd No. H/VJ/47

విశాలాంధ్ర

204403

విశాలాంధ్ర చందా వివరాలు

	ఏజెంటుద్వారా/పోస్టుద్వారా	
నెలకు	రు. 5-40	రు. 6-00
3 నెలలకు	16-20	18-00
6 నెలలకు	32-40	35-00
సంవత్సరమునకు	64-80	70-00

ఆదివారంతో సహా దినపత్రిక 18 పైసలు

సంపుటి 24 సంచిక 9 | విజయవాడ 14-4-74 ఆదివారం | 6 పేజీలు 18 పైసలు

అన్నిరకముల గ్యారేజిటూల్సు
సరసమైన ధరలకు

ప్రసాద్ బ్రదర్స్

ప్రకాశంరోడ్, విజయవాడ-2.

ఇదీ లోకం

"ఇది వర్క్ కండిషన్ యుగ
మని మనం పొరపడ్డాం సార్."

మేనెలలో కిసింగర్ భారత్ పర్యటన

వాషింగ్టన్, ఏప్రిల్ 13

మేనెలలో భారత్‌లో స్వల్పకాల పర్యటన చేయాలని విదేశాంగ మంత్రి కిసింగర్ అనుకుంటున్నట్లు విదేశాంగశాఖవర్గాలు వెల్లడించాయి.

వచ్చేనెల పశ్చిమాసియా వెళ్ళినపుడుగానీ లేక జులైలో మాస్కో వెళ్ళినపుడుగానీ ఆయన భారత్ రావచ్చు. ఇప్పటికి కిసింగర్ భారత్ పర్యటన అనేకసార్లు అకారణంగానూ, పెళ్ళి యితర పర్యటనల వల్లా వాయిదా పడింది.

సోమవారం ఇక్కడ భారత విదేశాంగ మంత్రి శ్రీ స్వరణ్ సింగ్‌ను కలుసుకున్నప్పుడు పర్యటన తేదీ నిర్ణయించబడవచ్చు.

నిక్సన్-గ్రోమికో భేటీ

అమెరికా అధ్యక్షుడు నిక్సన్, గ్రోమికో వైట్‌హౌస్‌లో చర్చించారని టాస్ తెలిపింది.

విదేశాంగ మంత్రి కిసింగర్, సోవియట్ రాయబారి అనతోలీడోబ్రినిన్, ఇతర ఉన్న తాధికార్లు చర్చల్లో పాల్గొన్నారు.

నిక్సన్ మాస్కో పర్యటన

కిలకాయుధాల పరిమితి ఒప్పందం జరిగినా జరగకపోయినా సరే నిక్సన్ మాస్కో వెళ్ళి సోవియట్ కమ్యూనిస్టుపార్టీ ప్రధాన కార్యదర్శి బ్రెజ్నేవ్‌తో చర్చిస్తారని కిసింగర్ చెప్పారు.

నిక్సన్ గ్రోమికో భేటీ అనంతరం ఆయన పత్రికలవారితో మాట్లాడుతూ మాస్కో శిఖరాగ్రసభలో చాల ఒప్పందాలు జరగవచ్చునని చెప్పారు.

బ్లాక్ మార్కెటీర్లు, దొంగ నిల్వదార్లపై కఠినచర్యలకు డిమాండ్

ప్రభుత్వ ఊగిసలాట వైఖరికి జంటనగరాల విద్యార్థి, యువజన సదస్సు ఖండన

హైదరాబాద్, ఏప్రిల్ 13

ఆహార ధాన్యాలు, యితర నిత్యజీవితావసర వస్తువుల ధరల పెరుగుదలకు కారకులైన బ్లాక్ మార్కెట్ దారులు; దొంగ వ్యాపారస్తులు, భూస్వాములు, గుత్త పెట్టుబడిదారులపై తీవ్ర చర్యలుతీసుకోవాలని జంటనగరాల విద్యార్థి, యువజన సదస్సు డిమాండ్ చేసింది.

వీరిపై చర్యలుతీసుకోవడంలో ప్రభుత్వం అనుసరిస్తున్న ఊగిసలాట వైఖరిని ఖండించింది.

బ్లాక్‌మార్కెట్‌దార్లు, దొంగ వ్యాపారస్తులు, భూస్వాములు, గుత్తపెట్టుబడిదారులు కృత్రిమమైన కొరతను సృష్టించడంద్వారా ధరల పెరుగుదలను తీవ్రతరం చేస్తున్నారని విమర్శించింది. వీరిపై తక్షణ చర్యలు తీసుకొని ప్రజల ఇబ్బందులను తొలగించాలని డిమాండ్ చేసింది.

అఖిలభారత యువజన సమాఖ్య, భారత యువజన కాంగ్రెసు, అఖిలభారత విద్యార్థి ఫెడరేషన్, నేషనల్ స్టూడెంట్స్ యూనియన్‌ల జంటనగరాల శాఖలు నిన్న ఇక్కడ అధిక ధరలకు నిరసనగా శ్రీకృష్ణదేవ రాయాంధ్ర భాషానిలయంలో సంయుక్తంగా నిర్వహించిన సదస్సు పైవిధంగా డిమాండ్ చేసింది.

జాతీయ స్థాయిలో అధిక ధరలకు నిరసనగా సంయుక్తంగా ఈ సంఘాలు ఐక్య వేదికను ఏర్పరచడంలో భాగంగా నగరంలో ఈ సదస్సును ఏర్పాటు చేశారు.

విద్యార్థులలో పెల్లుబుకుతున్న అసంతృప్తిని వినియోగించుకుని; దేశంలో సంక్షోభాన్ని సృష్టించి, అధికారాన్ని చేజిక్కించుకొనేందుకు మితవాద అభివృద్ధి నిరోధక శక్తులు, ఆర్. యస్. యస్; ఆనందమార్గ ఇతర జాతీయ విచ్ఛిన్నకశక్తులు చేస్తున్న కుట్రలను యీ సదస్సు ఖండించింది. ఈ కుట్రలపట్ల అప్రమత్తతతో ఉండాలని విద్యార్థి, యువజనులకు సదస్సు హెచ్చరిక చేసింది.

జాతీయ స్థాయిలో నిర్ణయించిన విధంగా అధిక ధరలకు, నిరుద్యోగానికి, ప్రభుత్వ యంత్రాంగంలో పెరిగి పోతున్న లంచగొండితనానికి వ్యతిరేకంగా సమరశీల పోరాటాలు నిర్వహించేందుకు ప్రతినచేస్తూ, సంఘటితంగాలేని అత్యధిక సంఖ్యలోగల విద్యార్థి, యువజనులను ఈ పోరాటంలో పాల్గొనాలని సదస్సు ఆహ్వానించింది.

ఈ డిమాండ్ల ప్రచారానికి నగరంలో వివిధ కళాశాలలలో, బస్తీలలో 50 సభలూ, సమావేశాలు జరపాలని, మే లేదా జూన్ మొదటివారంలో రాష్ట్రసచివాలయంముందు ప్రదర్శన నిర్వహించాలని సదస్సు నిర్ణయించింది. దొంగనిల్వలను బయటికి లాగే కార్యక్రమాన్ని త్వరలో చేపట్టటానికి సదస్సు నిర్ణయం తీసుకున్నది.

అంతకుముందు ప్రదేశ్ కాంగ్రెసు ప్రధాన కార్యదర్శి శ్రీ టి. హయగ్రీవాచారి, ప్రదేశ్ కమ్యూనిస్టు సమితి కార్యవర్గ సభ్యులు శ్రీ కె. యల్. మహేంద్ర సదస్సులో ప్రసంగించారు.

అఖిల భారత యువజన సమాఖ్య అధ్యక్షులు శ్రీ సుధాకరరెడ్డి ప్రసంగిస్తూ వివిధ రాష్ట్రాలలో యువజన విద్యార్థి ఉద్యమాలను గురించి వివరించారు.

గుజరాత్‌లో జరిగిన విద్యార్థి, యువజన పోరాటం వీరోచితమైంది. కాని వారు అక్కడి అభివృద్ధి నిరోధక శక్తుల చదరంగంలో తెలియకుండానే పావులుగా వుపయోగ పడుతున్నారని, అలాగే బీహారులో జరుగుతూందని వివరించారు.

ఇంతవరకు సర్వోదయం పేరుతో నాటకమాడుతున్న శ్రీ జయప్రకాశ్ నారాయణ నేడు ఈ పోరాటాలకు నాయకత్వం వహిస్తున్నారని అన్నారు.

రాజకీయాలకు అతీతంగా వుండాలని ప్రకటిస్తూనే దేశంలో అభివృద్ధి నిరోధక శక్తుల నాయకులుగా పేరొందిన శ్రీయుతులు చరణ్‌సింగ్, బిజూపట్నాయక్‌లు, పంజాబ్‌లోని అకాలీదళ్ నాయకులు, బీహారులోని అభివృద్ధినిరోధక శక్తులతో ఆయన మంతనాలు జరుపుతున్నారని విమర్శించారు.

శ్రీ జయప్రకాశ్‌నారాయణ అమెరికా సామ్రాజ్యవాదులకు సంబంధించిన సి. ఐ. ఏతో సంబంధంగల ఫోర్డు ఫౌండేషన్ తదితర సంస్థలకు డైరెక్టరుగా పని చేశారని శ్రీ సుధాకరరెడ్డి తెలిపారు.

సదస్సులో కర్నాటక రాష్ట్ర యువజన కాంగ్రెస్ కార్యదర్శి శ్రీ రఘుపతి కూడా ప్రసంగించారు.

ప్రదేశ్ యువజన సమాఖ్య ప్రధాన కార్యదర్శి శ్రీ ఎ. పుల్లారెడ్డి ప్రవేశపెట్టిన తీర్మానాన్ని ప్రదేశ్ యువజన కాంగ్రెస్ ఉపాధ్యక్షులు శ్రీ వెంకటరామరెడ్డి బలపరచారు.

సదస్సు కార్యక్రమాల నిర్వహణకు శ్రీయుతులు బాలపోచయ్య, శ్రీ వి వాన్, జైహింద్‌రెడ్డి అధ్యక్షవర్గంగా వ్యవహరించారు.

నిక్సన్ ఆదాయపు పన్నులు 4302 డాలర్లు

శాక్రెమెంట్ (కాలిఫోర్నియా) ఏప్రిల్ 13

1969 70కి సంబంధించిన 4302 డాలర్లు పన్నులు, జరిమానాలను అధ్యక్షుడు నిక్సన్ ఆయన భార్య కాలిఫోర్నియా రాష్ట్ర ప్రభుత్వానికి చెల్లించుకోవలసి వుంది.

1969-72 నాటికి వడ్డీతోసహా నిక్సన్ 476,431 డాలర్లు చెల్లించవలసి ఉందని పార్లమెంటు అధ్యయన సంఘం తెలిపిన 9 రోజుల తర్వాత కాలిఫోర్నియా పన్నుల బోర్డు పై విషయం నిన్న వెల్లడించింది. కాలిఫోర్నియాలో వచ్చిన ఆదాయం నుండే నిక్సన్ పన్ను కట్టవలసి ఉంటుందని బోర్డు చెప్పింది.

ఇదికాక ఫెడరల్ ప్రభుత్వానికి నిక్సన్ 5 లక్షల డాలర్లు చెల్లించాల్సి ఉంది.

కాలిఫోర్నియాలో రెండేళ్ళలో వచ్చిన దాదాపు 182,057 డాలర్లకు నిక్సన్ దరఖాస్తులు పన్నుకట్టాల్సివుంది. అనుమతించబడిన 117361 డాలర్లను తీసివేయగా పన్ను వేయదగ్గ ఆదాయం 65,097 డాలర్లుంది.

పాక్ పతినిధివర్గం చైనా పయనం

న్యూఢిల్లీ, ఏప్రిల్ 13

18 మంది సభ్యులుగల పాక్ ప్రతినిధివర్గం నేడు రావల్పిండి నుండి పెకింగ్ బయలుదేరిందని పాక్ రేడియో వెల్లడించింది.

లెజిస్లేటర్లు, పాలనాశాఖ అధికార్లుగల ఈ ప్రతినిధివర్గం చైనాలో 12 రోజులపాటు పర్యటిస్తుంది.

బొర్సాద్‌లో కర్ఫ్యూ పొడిగింపు

అహమ్మదాబాద్, ఏప్రిల్ 13

కైరా జిల్లా బొర్సాద్ పట్టణంలో నేడు తిరిగి కర్ఫ్యూ పొడిగించారు.

గత రాత్రి ఆ పట్టణంలో రెండు వర్గాల ప్రజలను చెదరగొట్టడానికి పోలీసులు జరిపిన కాల్పుల్లో నలుగురు మరణించారు.

ఘర్షణ సందర్భంగా 27 మందిని అరెస్టు చేశారు.

గయలో

గయలో కూడా నేడు కర్ఫ్యూ పొడిగించారు.



హైదరాబాద్ సన్మాన సభలో శ్రీమతి అలెండీ, కుమారి ఇనబెల్లా, శ్రీమతి మ్యారా
(ఢిల్లీలోని క్యూబా రాయబార కార్యాలయ ప్రథమ కార్యదర్శి)

చిలీకి భారత్, సోషలిస్టు దేశాల సంఘీభావం

శ్రీమతి అలెండీ కృతజ్ఞత

మద్రాసు, ఏప్రిల్ 13

స్వేచ్ఛా స్వాతంత్ర్యాలకై పోరాడుతున్న చిలీ ప్రజానీకానికి సంఘీభావం తెలపడంలో భారతదేశం, సోషలిస్టు దేశాలు గణనీయమైన కృషి చేశాయని హార్టెన్సియా బుసీ అలెండీ నేడిక్కడ అన్నారు.

హైదరాబాద్ నుండి ఇక్కడి విమానాశ్రయానికి వచ్చినపుడు ఇస్కస్, శాంతిశకపాలా ఉద్యోగుల సమాఖ్య, బ్యాంకు ఉద్యోగుల సమాఖ్య, భారత కమ్యూనిస్టు పార్టీ, అన్నా డి. యం. కె. ప్రతినిధులు ఆమెకు ఘన స్వాగతం పలికారు.

శాంతి, స్నేహం, సామాజిక న్యాయం కోసం పోరాడుతున్న చిలీ ప్రజల ఐక్యం, భారత ప్రజల ఐక్యం ఒకటేనన్నారు.

హైదరాబాద్ విమానాశ్రయంలో కమ్యూనిస్టుపార్టీ నాయకులు, కాంగ్రెస్ నాయకులు, శాంతి, సంఘీభావ సంఘ నాయకులు ఇస్కస్, విద్యార్థి, యువజన, మహిళా సమాఖ్యల నాయకులు శ్రీమతి అలెండీకి వీడ్కోలు చెప్పారు.

శ్రీమతి అలెండీ తిరువనంతపురం రాక

తిరువనంతపురం ఏప్రిల్ 13

శ్రీమతి హార్టెన్సియా బుసి అలెండి, కేరళలో మూడు రోజులపాటు పర్యటించటానికి ఇక్కడికి వచ్చినపుడు ఆమెకు ఘన స్వాగతం యిచ్చారు.

తిరువనంతపురం విమానాశ్రయంలో శ్రీమతి అలెండీకి తిరువనంతపురం మేయరు శ్రీ గోపీనాథన్ నాయర్, కమ్యూనిస్టు మంత్రులు శ్రీయుతులు గోవిందన్ నాయర్, టి.వి.థామస్, కాంగ్రెస్ మంత్రి శ్రీ కె కరుణాకరన్, రాష్ట్ర కమ్యూనిస్టు సమితి కార్యదర్శి శ్రీ యన్.ఇ బలరామ్, విద్యార్థి, యువజన, మహిళా సమాఖ్యల నాయకులు స్వాగతం చెప్పారు. శ్రీమతి అలెండివెంట ఆమె కుమార్తె కుమారి ఇనబెల్లా వచ్చారు.

త్వరలో నెవిన్ బంగ్లా పర్యటన

ఢాకా, ఏప్రిల్ 14

బర్మా అధ్యక్షుడు నెవిన్ ఈ నెల 26 నుంచి నాలుగు రోజులపాటు బంగ్లాదేశ్‌లో పర్యటిస్తారు.

జపాన్ రైల్వేకార్మికుల సమ్మె విరమణ

టోకియో, ఏప్రిల్ 13

తమ డిమాండ్లను యాజమాన్యం ఆమోదించిన సందువల్ల జపాన్‌లో 2 లక్షల 30 వేల మంది ప్రైవేట్ రైల్వే కార్మికులు నేడు సమ్మె విరమించారు.

నేరపరిశోధనకు 5 సంచార లేబరేటరీలు రాష్ట్రంలో ఏర్పాటు

కర్నూలు, ఏప్రిల్ 13

విశాఖపట్నం విజయవాడ, కర్నూలు, వరంగల్లు, హైదరాబాద్‌లలో నేర పరిశోధనకు ఉపకరించే 5 సంచార లేబరేటరీల ఏర్పాటుకు ఒక్కొక్క దానికి రు. 1 లక్ష చొప్పున ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం మంజూరు చేసింది.

ఈ విషయాన్ని నేడిక్కడ పోలీస్ సూపరింటెండెంటు శ్రీ తుల్జారామ్ తెలియచేస్తూ ప్రతి లేబరేటరీలోను ఒక ఫోరెన్సిక్ కెమిస్టు అసిస్టెంటు, ఒక ఫొటోగ్రాఫర్‌తో పాటు వేలి ముద్రలు చూచే విభాగం, ఒక వాహనం వుంటాయని తెలిపారు.

రాష్ట్రపతి ఎన్నికల్లో కాంగ్రెసుకు పూర్తి మెజారిటీ?

న్యూఢిల్లీ, ఏప్రిల్ 13

1974 ఆగస్టులో జరగనున్న రాష్ట్రపతి ఎన్నికల్లో అధికారపార్టీ అభ్యర్థికి మొదటి లెక్కింపులోనే 60 శాతానికి తగ్గకుండా ఓట్లు వస్తాయి.

అందువల్ల 1969లో కాంగ్రెసు చీలిక సందర్భంగా శ్రీ గిరి ఎన్నికవటానికి జరిగినంత తీవ్ర పోరాటం ఇప్పుడు ఉండబోదు.

1974 ఆగస్టు 23తో రాష్ట్రపతి శ్రీ గిరి పదవీ కాలం ముగియనుంది.

అనుకోని రాజకీయ ఉపద్రవాలు వచ్చి పడితేతప్ప రాష్ట్రపతి ఎన్నికలో (ప్రస్తుతం రాష్ట్ర శాసనసభలలో, పార్లమెంటులో కాంగ్రెస్‌కు తగిన పెద్ద మెజారిటీ ఉంది.

నామినేషన్లు, ఎన్నికల తేదీని జులైలో ఎన్నికల కమిషన్ ప్రకటిస్తుంది. బహూశా జులై మధ్యవరకూ తమ అభ్యర్థి ఎవరనే విషయాన్ని కాంగ్రెస్ అధిష్ఠానవర్గం చెప్పక పోవచ్చు. జయప్రకాశ్ నారాయణ్ పేరును బాల మితవాదపక్షాలు, రంగంలోకి తీసుకొచ్చాయి. కానీ ఆయన పోటీకి విరాకరిస్తూ ప్రకటించారు.

కాంగ్రెస్‌కు మొత్తం 10,92,654 ఓట్లలో 668,060 ఓట్లు రావాలని అంచనా. ఎలక్టోరల్ కాలేజీలో 4397 మంది ఎన్నికైన సభ్యులు (3646 మంది. శాసనసభ్యులు 751 మంది పార్లమెంటు సభ్యులు) ఉంటారు. కాంగ్రెస్‌కు 2553 మంది (శాసనసభల్లో 2063 మంది, పార్లమెంటు ఉభయసభల్లో 490 మంది) ఉన్నారు: లేదా మొత్తంలో 58 శాతం ఓట్లున్నాయి.

ఎలక్టోరల్ కాలేజీలో ఓటు విలువ 9 (నాగాలాండ్) నుండి 208 (ఉత్తర ప్రదేశ్) వరకూ ఉంది. పార్లమెంటు సభ్యుడి ఓటు విలువ 721.

ఈ ఏడాది ఎన్నికలలో గుజరాత్ నుండి పార్లమెంటు సభ్యులు మాత్రమే ఓటింగ్‌లో పాల్గొన బోతున్నారు. శాసనసభ రద్దయింది 1969లో బీహార్‌లో రాష్ట్రపతిపాలన ఉన్నప్పటికీ శాసనసభ సస్పెన్షన్‌లో ఉంది. అందువల్ల సభ్యులు ఓటు చేశారు.

వివిధ పార్టీల బలాబలాలు

మొత్తం 21 రాష్ట్రాల శాసనసభలలో గల 3646 స్థానాలకు గాను కాంగ్రెస్‌కు 2093 స్థానాలు వున్నాయి.

168 స్థానాలు గల గుజరాత్ శాసనసభ రద్దయి వుంది.

రాష్ట్రాల శాసనసభలలో వివిధ పార్టీల బలాబలాలు క్రింది విధంగా వున్నాయి:

డి యం. కె. 174 (మొత్తం తమిళనాడు) కమ్యూనిస్టుపార్టీ 155, జనసంఘ 153, భారతీయ క్రాంతిదళ్ 107, సిండికేటు 84, మార్క్సిస్టుపార్టీ 71, సోషలిస్టులు 45, స్వతంత్ర 40, అకాలీదళ్ 24, ముస్లిం లీగు 21, యస్ యస్ పి 19, అన్నా డి. యం. కె. 13 (తమిళనాడు) ఉత్కళ కాంగ్రెస్ 33 (ఒరిస్సా) ఆల్‌పార్టీ హిల్ పీపుల్స్ లీడర్స్ కాన్ఫరెన్సు 39 (మేఘాలయ) యు డి. యఫ్. 32, యన్. యన్.ఒ. 28 (నాగాలాండ్) మిగతా 500 స్థానాలు ప్రాంతీయ పార్టీలు, ఇండిపెండెంట్లకు సంబంధించినవి 168 స్థానాలుగల గుజరాత్ శాసనసభలోపాటు వివిధ రాష్ట్ర శాసనసభలలో 24 స్థానాలు ఖాళీగా వున్నాయి.

పార్లమెంటు ఉభయ సభలలోని 751 స్థానాలలో కాంగ్రెస్‌కు 490 స్థానాలు. కమ్యూనిస్టుపార్టీకి 36, మార్క్సిస్టుపార్టీకి 33, జనసంఘ్ 31, డి. యం. కె. 31, సిండికేటు 21, స్వతంత్రపార్టీకి 10 స్థానాలు వున్నాయి.

మిగతా స్థానాలు యితర పార్టీలు, గ్రూపులు, యిండిపెండెంట్లకు సంబంధించినవి. లోక్‌సభలో అయిదు స్థానాలు, రాజ్యసభలో నాలుగు స్థానాలు ఖాళీగా వున్నాయి.

సోవియట్ శాస్త్రజ్ఞుల అత్యద్భుత పథకం

నిముషాల్లో డామ్ నిర్మాణం

మాస్కో, ఏప్రిల్ 13

కొద్ది నిమిషాల్లోనే బ్రహ్మాండమైన డామ్ నిర్మించే అత్యద్భుత ప్రయోగాన్ని సోవియట్ యూనియన్ చేయనున్నది.

అమెజార్ జఖిస్తాన్ ప్రాజెక్టుకై నిర్మించబడే యీ డామ్ మూడు కిలో మీటర్ల పొడవు, 300 మీటర్ల ఎత్తు వుంటుంది. నమ్మశక్యంగాని బృహత్తర కార్యాన్ని ప్రపంచంలో కల్లా పెద్ద ప్రేలుడుతో సాధించ బోతున్నారు. 1945లో హిరోషిమా నగరాన్ని భస్మీపటలం చేసిన అమెరికా అణు బాంబు కంటె ఈ ప్రేలుడు శక్తి 25 రెట్లు అధికం.

తీన్‌షాన్ పర్వత శ్రేణుల గుండా ప్రవహించే నార్యన్ నది ఒడ్డున నిటారుగా ఉండే రాతి ప్రాంతంలో ఈ నిర్మాణం చేస్తారు.

ఎలా కడతారు ?

ఈ డామ్ కట్టడానికి 5 లక్షల టన్నుల ప్రేలుడు పదార్థాలు ఉపయోగిస్తారు. ముందుగా జాగ్రత్తగా రూపొందించిన మేరకు వరసగా జరిగే ప్రేలుళ్ళవల్ల 50 కోట్ల ఘనపు మీటర్ల రాళ్ళు గాలిలోకి ఎగచిమ్ముతాయి. అవన్నీ నదీగర్భంలో పడి డామ్ అవుతుంది.

ఇదంతా నిముషాల్లోమనకళ్ళముందే జరుగుతుంది. మామూలుగా పాత పద్ధతిలో ఇలాంటి డామ్ కట్టాలంటే అనేక సంవత్సరాలు పడుతుంది.

ప్రేలుడువల్ల నది అడుగున ఉండే రాళ్ళు విపరీతమైన ఒత్తిడికి గురై నదీ గర్భం లోతుగ వేగంగా చొచ్చుకుపోయి చెక్కుచెదరని బలీయమైన పునాది ఏర్పడుతుంది. రాళ్ల నుజ్జు నుజ్జయి కాపడమయి పోతాయి. ఫలితంగా నీటి పడపోత అతి తక్కువ స్థాయికి వచ్చేస్తుంది.

8 ఏళ్ళ క్రితమే..

ఇలాంటి "ఇన్‌స్టెంట్ డామ్‌ను సోవియట్ యూనియన్ ప్రప్రథమంగా 1966లో అల్మాఆటా నగరాన్ని బురద వరదలనుండి రక్షించడానికి నిర్మించింది. 5,300 టన్నుల ప్రేలుడు పదార్థాలతో నిర్మించిన ఆ డామ్ ఎత్తు 50 మీటర్లుంది. అయితే ఇపుడు జరపనున్న ప్రేలుడు దానికంటె చాలా పెద్దది.

తమ ఇంజనీరింగ్ అంచనాలను ఖచ్చితంగా సరిచూసుకునేందుకు వచ్చేశీతాకాలంలో సోవియట్ శాస్త్రజ్ఞులు ఈ పెద్ద డామ్‌కు "డ్రెస్‌రిహార్సల్" జరుపుతారు. అసలు నిర్మాణంలో ఇది పదవవంతు ఉంటుంది. నార్యన్ ఉపనది అయిన బర్లికినదీ లోయలో ఈ చిన్న ప్రేలుడు జరుగుతుంది. ఫలితంగా 30 మీటర్ల ఎత్తు 300 మీటర్లు పొడవు వున్న డామ్ క్షణాల్లో తయారవుతుంది. నార్యన్‌లో నిర్మాణానికి తేదీ ఏదీ ఇంకా నిర్ణయించలేదు. అది 1980లో జరగవచ్చునని అనుకుంటున్నారు

ప్రగతికోసం ప్రేలుడు

రెండవ ప్రపంచ యుద్ధం తర్వాత మిగిలిపోయిన ప్రేలుడు పదార్థాలను నిర్మాణ కార్యకలాపాలకు వినియోగించాలన్న ఆలోచన 1940 దశకంలో మొదలయింది. ప్రయోగాలు ప్రారంభంలోనే విజయవంత మయ్యాయి. అందుకనే కాల్వలూ, డామ్‌లకు ప్రేలుడు పద్ధతి సోవియట్లో ఎక్కువగా వినియోగిస్తున్నారు. గనుల తవ్వకం బదులు యీ పద్ధతి ఎంతో చౌకవుంది.

రోజుకో రిజర్వాయర్

ఉదాహరణకు ఖయిబ్ మజార్‌స్కీ రిజర్వాయర్ (ఉజ్బెకిస్తాన్) దాదాపు ఒక్క రోజులోనే నిర్మించారు. అక్కడ 1500 టన్నుల ప్రేలుడు పదార్థాలవల్ల 3 లక్షల ఘనపు మీటర్ల మట్టి వెలికి వచ్చింది. సోవియట్ కనిపెట్టిన ఈ పద్ధతి ప్రకారం ఒక పొడవాటి ప్లాస్టిక్ గొట్టంలో పేలుడుగుండ దట్టిస్తారు. భూమి ఉపరితలానికి కిందుగా కొంత ఎత్తున ట్రాక్టర్ చేసిన చాలులో ఆ గొట్టాన్ని సమాంతరంగా పెట్టి ప్రేలుస్తారు.

నీటిలో పేలుడు

కాల్వలకేగాక నదీగర్భాన్ని నదిగోడలనూ శిలాసదృశం చేయడానికి సోవియట్ శాస్త్రజ్ఞులు ఈ పద్ధతి అవలంబిస్తున్నారు

కొత్తగా తవ్విన కాల్వలోకి నీరు వంపుతారు నీటి కింద పేలుడు జరుపుతారు. ఆ ఒత్తిడికి బురద కణాలన్ని కాల్వ గోడలకు అపరిమితమైన వేగంతో ఢీకొని సంఘటితంగా ఉండిపోతాయి.

మధ్యప్రదేశ్‌లో రాగి గని

1400 టన్నుల పేలుడు పదార్థాలతో మధ్యప్రదేశ్‌లో రాగిగని తవ్వవచ్చునని సోవియట్ చేసిన ప్రతిపాదనను భారత్ ప్రస్తుతం పరిశీలిస్తోంది.

అలాచేస్తే భారత్ గనుల పరిశ్రమలోనే అది పెద్ద పేలుడు కార్యక్రమం అవుతుంది.

బలోపేతమవుతున్న వర్థమాన దేశాల ఐక్యత

మాస్కో, ఏప్రిల్ 13

వర్థమాన దేశాలకు ప్రత్యేక విధి ఏర్పరచాలన్న మూనె ఉత్పత్తి దేశాల నిర్ణయం, తృతీయ ప్రపంచ స్వతంత్ర తరుణ రాజ్యాల మధ్య నానాటికీ బలోపేతమవుతున్న ఆర్థిక సంబంధాల కొక కొత్త నిదర్శన మని సోవియట్ ప్రభుత్వ పత్రిక ఇజ్వెస్తియా తెలిపింది.

ఈ ప్రత్యేక విధివల్ల సొంతంగా మూనె లేని వర్థమానదేశాలు ఇంధనం కొరతను అధిగమిస్తాయి. అంతేకాదు - సామ్రాజ్యవాదులపై ఆధారపడకుండా ఇంకా విముక్తి అవుతాయి అని రాసింది. మూనె ఉత్పత్తి ఎగుమతి దేశాల మంత్రుల జెనీవా సభపై వ్యాఖ్యానంలో ఇలా పేర్కొన్నట్లు టాస్ తెలిపింది.

వర్థమానదేశాల మధ్య అవగాహన మెరుగౌతున్నదనీ, వలసవాద పవాదుల కుట్రలకు వ్యతిరేకంగా సాగే పోరాటాల ఐక్యసంఘటనను విస్తృతం చేయాలనే ఆకాంక్ష జెనీవా నిర్ణయంలో ప్రస్ఫుటమవుతోందని చెప్పింది.

గుత్తసంస్థల నిరోధమే పరిష్కారం

జి.డి.ఆర్. ప్రతినిధి ప్రసంగం

ఐ. రా. స. ఏప్రిల్ 13

గుత్తసంస్థలను విరోధించడంవల్లా, తమ సహజ వనరులపై సంపూర్ణ హక్కు పొందడంవల్లా మాత్రమే తృతీయ ప్రపంచ దేశాల సమస్యలకు పరిష్కారం లభిస్తుందని తూర్పు జర్మనీ విదేశాంగ మంత్రి ఓస్కార్ ఫిషర్ నేడిక్కడ ఉద్ఘాటించారు.

ఆయన ఐ. రా. స జనరల్ అసెంబ్లీ ప్రత్యేక సమావేశంలో ప్రసంగించారు.

ఆసియా, ఆఫ్రికా, లాటిన్ అమెరికా దేశాలు ఇప్పటికే నయావలస దోపిడీకి గురవుతున్నాయని, ప్రపంచ శాంతి భద్రతల పటిష్ఠతకూ, ఆర్థిక సమస్యల పరిష్కృతికీ సన్నిహిత సంబంధం వున్నదని ఆయన అన్నారు.

బంగ్లా విదేశాంగ విధానానికి ఘన విజయం

ఢాకా భావన

ఢాకా, ఏప్రిల్ 13

బంగ్లాదేశ్ పుట్టినప్పటినుండీ అనుసరిస్తున్న విదేశాంగవిధానానికి ఢిల్లీ త్రైపాక్షిక ఒప్పందం ఒక అద్భుత విజయంగా ఇక్కడ పరిగణిస్తున్నారు.

ఢిల్లీనుంచి వచ్చినతర్వాత విదేశాంగ మంత్రి కమాల్ హుస్సేన్ గురువారం పత్రికల వారితో మాట్లాడుతూ ఇలా చెప్పారని తెలుస్తూంది.

స్వాతంత్ర్య పోరాటంలో నేరాలు చేసిన వారిపై విచారణ జరుపుతామని బంగ్లా నాయకులు చాలసార్లు దృఢ సంకల్పం ప్రకటించారు. కానీ క్షమించి, మరిచిపోవాలనే ధోరణి ఢిల్లీ చర్చలలో వచ్చిన సంకల్పంగా ఉపఖండ శాంతికై విస్తృత ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకుని విచారణ రద్దుచేయాలని నిర్ణయించారు. పైగా నేరాలు జరిగి ఉంటే వాటిని పాక్ ఖండించింది. క్షమాపణ చెప్పింది.

అపరిష్కృత సమస్యలపై పాక్ బంగ్లాల మధ్య అధికార స్థాయి చర్చలు జరుగుతాయి. ముజిబ్-భుట్టోల మధ్య ప్రస్తావనకు రాగల అంశాలను వారు చర్చిస్తారు.

వాంగ్ మింగ్ మృతి

మాస్కో, ఏప్రిల్ 13

అంతర్జాతీయ కమ్యూనిస్టు ఉద్యమంలో అనుభవశాలి, చైనా కమ్యూనిస్టుపార్టీ ప్రముఖ నాయకుడు వాంగ్‌మింగ్ గత మార్చి 27న యిక్కడ తమ 69వ ఏట మరణించారు.

మావో తప్పుడు విధానాలను గ్రహించి వాటినినిరసించిన మార్క్సిస్టు-లెనినిస్టు అంతర్జాతీయదృక్పథంతో చైనా కమ్యూనిస్టుపార్టీలో ప్రతిఘటించిన వ్యక్తి ఈయన. 1956లో ఈయన చైనా కమ్యూనిస్టుపార్టీ కేంద్ర కమిటీ అనుమతితో సోవియట్‌కు వచ్చారు.

1926లో ఈయన కమ్యూనిస్టుపార్టీలో చేరారు. 1931లో చైనా కమ్యూనిస్టుపార్టీ కేంద్ర కమిటీ పొలిట్ బ్యూరోకు ఎన్నికయ్యారు. కొద్ది కాలంపాటు కేంద్ర కమిటీ ప్రధానకార్యదర్శిగాకూడా పనిచేశారు.

1931-37లో కమ్యూనిస్టు ఇంటర్నేషనల్‌లో చైనా కమ్యూనిస్టుపార్టీ ప్రతినిధిగా పాల్గొన్నారు.

1945లో జరిగిన చైనా కమ్యూనిస్టు పార్టీ ఏడవ మహాసభలో 1956లో జరిగిన ఎనిమిదవమహాసభలోనుఆయన కేంద్రకమిటీ సభ్యులుగా ఎన్నికయ్యారు.

సోవియట్ - చైనాలమధ్య సుదృఢమైన స్నేహసహకార సంబంధాలుండాలని గట్టిగా వాదించేవారిలో ఈయన ఒకరు.

మావో ఆయన ముఠా వాంగ్‌మింగ్ తదితరులపట్ల అనుసరించిన కక్షసాధింపు వైఖరి వాంగ్‌మింగ్ తన 1944-45 సంవత్సరము చైనా డైరీలో వ్రాసిన విషయాలవల్ల ఆ రోజుల్లో కూడా మావో తన వ్యతిరేకులను ఏవిధంగా హతమొనర్చటానికి ప్రయత్నించాడో తేటతెల్లమౌతుంది. మందుకు బదులుగా విషమివ్వటానికి కూడా ప్రయత్నించాడు. ఈ రహస్యం బయటపడటంతో విరమించుకున్నాడు. వైద్యచికిత్స కొరకు వాంగ్‌మింగ్‌ను మాస్కోకు తీసుకువెళ్ళడానికి వచ్చిన ప్రత్యేక విమానం మావో అడ్డం. కుటిలవల్ల కొన్ని రోజులు చైనాలో ఎదిగాపులుకాచి చివరకు ఖాళీగానే వెళ్ళిపోయింది.

వాంగ్‌మింగ్‌ను ఏకాకి చేయటానికి ఆయనను రాజకీయంగా ఓడించటానికి మావో చేసిన దుష్ప్రచారం, కుట్రలకు అంతులేదు.

గార్షియాలో స్థావరానికి మారిషస్ తీవ్ర వ్యతిరేకత

శ్రీమతిగాంధీతో చర్చల్లో రామ్‌గులామ్ వెల్లడి

న్యూఢిల్లీ, ఏప్రిల్ 13

డిగోగార్షియా దీవిని సైనిక స్థావరంగా మార్చడానికి మారిషస్ ప్రధానిరామ్ గులామ్ నేడు తీవ్ర వ్యతిరేకత వెల్లడించారు.

ప్రధాని శ్రీమతి గాంధీతో అరగంట చర్చల సందర్భంగా ఆయన తన అభిప్రాయాలు తెలిపారు. మూడు రోజులపాటు పర్యటించేందుకు రామ్‌గులామ్ నిన్న ఇక్కడికి వచ్చారు. ఉదయం ఆయన శ్రీమతి గాంధీ ఇంటికివెళ్ళి కలుసుకున్నారు. ద్విపక్ష సంబంధాలు, హిందూమహాసముద్రం గురించి వారు చర్చించారు.

అనంతరం పత్రికలవారితో మాట్లాడుతూ భారత్ - మారిషస్‌లకు సన్నిహిత స్నేహ సంబంధాలున్నాయనీ, అనేక అంతర్జాతీయ అంశాలపై నిరంతరం సంప్రదిస్తున్నామనీ చెప్పారు.

డిగోగార్షియా సమస్యపై బ్రిటన్‌కు నిరసన తెలిపామని, గత రాత్రి వచ్చినపుడు ఆయన అన్నారు. తమ దేశంలో భాగమైన ఆ దీవిని తిరిగి తమకు ఇచ్చివేయాలని కోరామని తెలిపారు.

కేవలం కమ్యూనికేషను ఏర్పాటు చేసేందుకనే అవగాహనతో 30 లక్షల పౌండ్ స్టెర్లింగ్‌లకు ఆ దీవిని బ్రిటన్‌కు గతంలో అమ్మేశారు. అలాంటి కమ్యూనికేషన్ అవసరం లేనపుడు గార్షియాను తిరిగి మారిషస్‌కు ఇచ్చివేయాలని కూడా అమ్మకానికి సంబంధించిన అత్యవసర ఒప్పందంలో ఉంది. ఆ దీవిని ఎన్నటికీ సైనిక స్థావరంగా మార్చరాదని ఒప్పందం స్పష్టం చేస్తోంది.

విశాలాంధ్ర

1974 ఏప్రిల్ 14 ఆదివారం

రైల్వే కార్మికుల న్యాయమైన కోర్కెలు

అవసరాన్ని బట్టి కనీస వేతనం, బోనస్ తదితర డిమాండ్ల సాధనకై రైల్వే కార్మికులు చాలా కాలంగా ఆందోళన చేస్తున్నారు. భారతదేశంలో అతి ప్రాచీనమైన, ప్రధానమైన ప్రభుత్వరంగ పరిశ్రమగా నిర్వహింపబడుతున్న రైల్వేలలో వివిధ కాటగిరీలకు చెందిన ఉద్యోగుల, కార్మికుల సమస్యలు చిర కాలంగా అపరిష్కృతంగా వుండటంతో విస్తృతంగా నెలకొన్న అసంతృప్తి తీవ్ర స్థాయికి చేరింది.

కొన్నింటికి సంబంధించి ఒప్పందాలు కుదిరినా రైల్వే బోర్డు అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక, నిరంకుశ ధోరణివల్ల అవి అమలు జరగడంలేదు. గత రెండు సంవత్సరాలలో జరిగిన లోకో సిబ్బంది సమ్మెలే ఇందుకు ఉదాహరణ. మొదటి సమ్మె సందర్భంగా రైల్వే మంత్రితో లోకో సిబ్బంది సంఘనాయకులు సంప్రతింపులు జరిపిన ఫలితంగా కుదిరిన ఒప్పందాన్ని అమలు చేయవలసిన రైల్వే బోర్డు సవాలక్ష మడతపేచీలు పెట్టి అది ఆచరణలోకి రాకుండా అడ్డుకొంది. ఆ ఒప్పందం అమలుకై రైల్వే బోర్డు కార్మిక వ్యతిరేక వైఖరికి నిరసనగా రెండవసారి లోకో సిబ్బంది సమ్మె చేయడం మినహా ప్రత్యామ్నాయం లేని స్థితి ఏర్పడింది. పర్యవసానంగా రవాణా స్తంభించిపోవడానికి, నష్టం రావడానికి రైల్వే బోర్డుదే బాధ్యత. కాగా కార్మికులు చీటికి మాటికి సమ్మెలు చేస్తుండడం వల్లనే దేశ ప్రయోజనాలు, రైల్వే నిర్వహణ దెబ్బతింటున్నట్లు ప్రధానమంత్రి మొదలు క్రిందివరకు యిటీవల చేస్తున్న ప్రచారం దుర్బుద్ధితో కూడిన నిందా ప్రచారం తప్ప మరొకటి కాదు.

వివిధ కేంద్ర ట్రేడ్ యూనియన్లకు అనుబంధించబడిన రైల్వే కార్మిక సంఘాలు (ఒక్క యన్. యఫ్. ఐ. ఆర్. మినహా), ఇండిపెండెంట్ కాటగిరీ యూనియన్లు ఫిబ్రవరి 27 న ఢిల్లీలో సమావేశమై తమ కోర్కెల సాధనకై సమ్మెతో సహా అన్నిరకాల ప్రత్యక్ష కార్యాచరణతో కూడిన ఆందోళన చేపట్టాలని, ఈ విషయంలో రైల్వే శాఖతో సంప్రతింపులు జరపడానికి సమన్వయ కమిటీని ఏర్పాటు చేసుకొన్నాయి. ఈ కమిటీలో భాగస్వామి కాకపోయినా ఐ. యన్. టి. యు. సి. నాయకత్వానవున్న యన్. యఫ్. ఐ.ఆర్. కూడా బోనస్‌లాంటి ప్రధానమైన డిమాండ్‌పై భిన్నాభిప్రాయం కలిగిలేదు. తమ "గుర్తింపు" పొందిన రెండు ఫెడరేషన్లతో తప్ప యితర సంఘాలతో సంప్రదింపులు జరగకూడదని భీష్మించుకొన్న రైల్వే బోర్డు యింతకాలంగా లేవదీస్తున్న అభ్యంతరాలను ప్రక్కనపెట్టి అన్ని సంఘాలకు ప్రాతినిధ్యం వహిస్తున్న సమన్వయ కమిటీ ప్రతినిధులతో రైల్వేమంత్రి, కార్మికమంత్రి ప్రస్తుతం చర్చలు కొనసాగించడం కొంతలోకొంత మెరుగనే చెప్పాలి. అయితే రైల్వేబోర్డు, ప్రభుత్వమూ తిరిగి ఏవో అడ్డుపుల్లలూ, అభ్యంతరాలు పెట్టే ప్రమాదం లేకపోలేదు.

ఏ సాకుతోనైనా కార్మికులలో విభేదాలు కల్పించి తమ పబ్బంగడుపుకొందామనే కదుపుకట్టిన కార్మిక వ్యతిరేక వైఖరి కొనసాగడం యిక అసాధ్యం అన్న వాస్తవాన్ని ప్రభుత్వమూ, రైల్వే బోర్డు గుర్తించడం అవసరం. ఏ సంఘానికనుబంధంగా వున్నప్పటికీ పశ్చిమ బెంగాల్‌లో జూట్ కార్మికులు, బొంబాయిలో జౌళి కార్మికులు సమైక్యంగా నిలిచి వీరోచిత పోరాటాలు జరిపి కోర్కెలు సాధించుకొన్న అనుభవాన్ని దృష్టిలో పెట్టుకొని అందుకనుగుణంగా ప్రవర్తిస్తే అందరికీ ప్రయోజనకరంగా వుంటుంది.

రైల్వేకార్మికనాయకులతో శ్రీ ఎల్.ఎస్. మిశ్రా చర్చలు

న్యూఢిల్లీ, ఏప్రిల్ 12

రైల్వేఉద్యోగుల డిమాండ్లపై వివరంగా సంప్రదింపులు జరపడానికి రైల్వే మంత్రి శ్రీ ఎల్. యన్. మిశ్రా నేటి చర్చలలో అంగీకరించారు.

సంప్రదింపులు సోమవారంనాడు తిరిగి ప్రారంభిస్తారు.

మనం సంప్రదింపులు జరపాలని రైల్వే మంత్రి చెప్పారు. అది ఉపయోగకరమైనదే. అనేక రోజులుగా సంప్రదింపుల కొరకు తీవ్ర ప్రయత్నాలు చేశాం అని రైల్వే పోరాటం సమన్వయ కమిటీ కన్వీనరు శ్రీ జార్జి ఫెర్నాండెజ్ తెలిపారు.

సంప్రదింపులు ప్రారంభమైన తరువాత 7 రోజులలో ముగియాలని రైల్వేమంత్రిని శ్రీ ఫెర్నాండెజ్ కోరారు. ఆ ప్రతిపాదనను ప్రారంభంలో శ్రీ మిశ్రా అంగీకరించక పోయినా తరువాత అంగీకరించారు.

ఒప్పందం జరిగేదీ, లేనిదీ చెప్పలేను. అయితే సంప్రదింపుల సంప్రదం కొరాలని ఒక విలేకరి ప్రశ్నకు సమాధానంగా శ్రీ ఫెర్నాండెజ్ తెలిపారు.

నేటి చర్చలలో కార్మిక మంత్రి శ్రీ కె. వి. రఘునాథరెడ్డి, డిప్యూటీ రైల్వే మంత్రి శ్రీ మహమ్మద్ షఫీ ఖురేషి, రైల్వే బోర్డు ఛైర్మన్ శ్రీ యం. యస్. [illegible], రైల్వే బోర్డులోని యితర సభ్యులు పాల్గొన్నారు.

ఉద్యోగుల పక్షాన ఆలిండియా రైల్వే మెన్స్ ఫెడరేషన్, నేషనల్ ఫెడరేషన్ ఆఫ్ రైల్వేమెన్, ఆలిండియా స్టేషన్ యూనియన్ కాంగ్రెసు, భారతీయ మజ్దూర్ సంఘ్, ఇండియన్ రైల్వే వర్కర్స్ ఫెడరేషన్, హింద్ మజ్దూర్ సభ, ఆలిండియా రైల్వే ఎంప్లాయీస్ కాన్ఫెడరేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

కొన్ని ముఖ్యమైన సమస్యలను చర్చించడానికిగాను ఆలిండియా గార్డ్సు కౌన్సిల్ కేంద్ర కార్యవర్గ సమావేశం ఆదివారంనాడు ఢిల్లీలో జరుగనున్నది.

మహిళల ప్రదర్శనలు

దక్షిణ రైల్వేలోని తిరుచురాపల్లి, గుంతకల్లు, మధురై, మైసూరులోని డివిజనల్ కార్యాలయాల, మద్రాసులోని జనరల్ మేనేజరు కార్యాలయం ఎదుట ఏప్రిల్ 20 వ తేదీన మహిళల ప్రదర్శన జరుపుతారని, యిందులో మహిళా ఉద్యోగులు, రైల్వేఉద్యోగుల భార్యలు పాల్గొంటారని సమన్వయ కమిటీ దక్షిణ మండల కన్వీనరు శ్రీ నమశ్శివాయ నేడు ప్రకటించారు.

సోవియట్ నాయకులతో అసాద్ చర్చలు

మాస్కో, ఏప్రిల్ 12

సోవియట్ నాయకులతో సిరియా అధ్యక్షుడు అసాద్ చర్చలు నేడు ముగిశాయని టాస్ వార్తా సంస్థ ప్రకటించింది

నిన్న ఇక్కడకు వచ్చిన అసాద్ సోవియట్ కమ్యూనిస్టుపార్టీ ప్రధాన కార్యదర్శి బ్రెజ్నెవ్, ప్రధాని కొసిగిన్‌లతో చర్చలు జరిపారు.

ఇస్రాయిల్ అధికారవర్గం, విదేశీ శక్తుల మద్దతు కారణంగా శాంతికి ప్రమాదకరంగా పరిణమించి దుర్నీతితో కొనసాగుతున్న పశ్చిమాసియా పరిస్థితిపై చర్చను కేంద్రీకరించడం జరిగిందని టాస్ తెలిపింది

పశ్చిమాసియాలో శాంతి సాధనకు కృషిని కొనసాగించాలని ఉభయ పక్షాలు పునరుద్ఘాటించాయి.

పశ్చిమాసియాలో శాంతి సాధనకు ఆక్రమిత అరబ్ భూభాగాలనుండి ఇస్రాయిల్ సైన్యాలు వైదొలగాలని, పాలస్తీనియన్ల హక్కులను కాపాడాలని ఉభయ పక్షాలు పునరుద్ఘాటించాయి

సుస్థిర సంస్థలపై దాడులు

కె. ఆర్. గణేష్ ఆందోళన

మద్రాసు, ఏప్రిల్ 12

ప్రణాళికా బద్ధమైన అభివృద్ధిని అడ్డుకునేందుకు దేశంలోని సుస్థిరమైన సంస్థలపై కొన్ని శక్తులు దాడిచేయడం పట్ల కేంద్ర ఆర్థిక శాఖ స్టేట్ మంత్రి శ్రీ కె. ఆర్. గణేష్ నేడు ఆందోళనను వెలిబుచ్చారు.

"ప్రణాళిక అమలులో సమస్యలు" అనే అంశంపై ఇక్కడ జరిగిన ఒక గోష్ఠిలో ప్రసంగిస్తూ ఆయన పై విధంగా అన్నారు. ప్రణాళికా విధానం, పార్లమెంటరీ ప్రజాస్వామ్యంపై ప్రధానంగా ఈ దాడులు జరుగుతున్నాయని ఆయనన్నారు.

ఈ సంస్థలపై ప్రజల నమ్మకాలను పునరంకితం చేయడమే ప్రస్తుతం దేశానికి కావలసింది అని ఆయనన్నారు.

త్వరలో బీహారు మంత్రివర్గ పునర్వ్యవస్థీకరణ

కాంగ్రెస్ అధ్యక్షులు డా. శర్మ వెల్లడి

న్యూఢిల్లీ, ఏప్రిల్ 12

రెండు, మూడు రోజులలో బీహారులో గఫూర్ మంత్రివర్గాన్ని పునర్వ్యవస్థీకరించవచ్చునని తెలుస్తున్నది.

మంత్రివర్గంలోని కొందరిని పార్టీ కార్యకలాపాలకు బదిలీ చేయడం జరుగుతుందని కాంగ్రెసు అధ్యక్షులు శ్రీ శంకరదయాళ్‌శర్మ నేటి సాయంత్రం పత్రికా విలేకరులతో అన్నారు.

ఎ. ఐ. సి. సి. ప్రధాన కార్యదర్శి శ్రీమతి ఎం. చంద్రశేఖర్, బీహారు ప్రదేశ్ కాంగ్రెసు అధ్యక్షులు శ్రీ సీతారామ కేసరి విడివిడిగా డా॥ శర్మతో చర్చలు జరిపారు.

పాట్నాలో పార్టీ నాయకులతో జరిపిన చర్చలను డా॥ శర్మకు శ్రీమతి చంద్రశేఖర్ వివరించారు.

ప్రధానంగా రెండు కారణాలపై గఫూర్ మంత్రివర్గంపైన గత కొంత కాలంగా విమర్శ పెరుగుతున్నది. ఒకటి మంత్రివర్గం అసమర్థత, రెండవది అవినీతి అదుపులో పెట్టడంలో వైఫల్యం.

పార్టీ, ప్రభుత్వం ప్రతిష్ఠను పెంచడానికిగాను మంత్రివర్గాన్ని పునర్వ్యవస్థీకరించాలని కాంగ్రెసు అధిష్ఠానవర్గం ప్రయత్నిస్తున్నది.

ప్రధాని శ్రీమతి ఇందిరాగాంధీకి కూడా శ్రీమతి చంద్రశేఖర్ పరిస్థితిని వివరించారు.

మంత్రివర్గం పునర్వ్యవస్థీకరణకు వీలుగా ముఖ్యమంత్రితోసహా మంత్రులందరూ రాజీనామాలు సమర్పించిన సంగతిని ఆమె వివరించారు.

పార్టీలో కొన్ని విభేదాలున్నప్పటికీ, అభివృద్ధి విరోధకులు, ఫాసిస్టు శక్తుల సవాలును ఎదుర్కొనేందుకు కాంగ్రెసు వాదులు ఐక్యంగా ఉన్నారని ఆమె చెప్పారు.

త్వరలో మణిపూర్ మంత్రివర్గ విస్తరణ

ఇంఫాల్, ఏప్రిల్ 12

మణిపూర్ మంత్రివర్గాన్ని ఏప్రిల్ 20 వ తేదీన విస్తరించడం జరుగుతుందని యునైటెడ్ లెజిస్లేచర్ పార్టీ నాయకులు నేడిక్కడ తెలియజేశారు.

యువతిపై అత్యాచారం

ఉనా, ఏప్రిల్ 12

సమీప గ్రామంలో ఒక యువతిని 4 గురు వ్యక్తులు దారుణంగా హింసించారని పోలీస్ సూపరింటెండెంటు శ్రీ మోహన్ సింగ్ నిక్కడ తెలిపారు.

ఆ యువతి భర్త ఇంట్లోలేని సమయంలో దుండగులు ఇంట్లో ప్రవేశించారని, ఆ తరువాత ఆమెను, ఆమె భర్తను పోలీసు స్టేషన్‌కు వెళ్ళి రిపోర్టుచేయకుండా అడ్డుకొన్నారని ఆయన తెలిపారు

అయితే ఆ దంపతులు అతికష్టంమీద పోలీసుస్టేషన్‌కు వచ్చి రిపోర్టుచేసారని తెలియజేసారు.

మత సంస్థల నిషేధానికి డిమాండ్

కందుకూరు తాలూకా యువజన సమాఖ్య మహాసభలో

కందుకూరు, ఏప్రిల్ 13

ఆనందమార్గ్, శివసేన, జమైతె ఇస్లామి తదితర మతసంస్థలను నిషేధించాలని ఈ నెల 6 న జరిగిన ప్రకాశంజిల్లా కందుకూరు తాలూకా యువజన మహాసభ డిమాండ్ చేసింది.

మహాసభ ప్రారంభంలో కావనపల్లెలు శ్రీ దిడి వెంకటయ్య యువజన పతాకాన్ని ఎగరవేశారు.

యీ మహాసభకు ఏ రాముడు: కె. అరుణ, కె. హరిశ్చంద్రారెడ్డిలు అధ్యక్ష వర్గంగా ఎన్నుకోబడ్డారు. 120 మంది ప్రతినిధులు హాజరైనారు. రాష్ట్ర యువజన సమాఖ్య ప్రధాన కార్యదర్శి శ్రీ ఎ. పుల్లారెడ్డి ప్రారంభించారు.

సభలో శ్రీయుతులు నల్లూరి వెంకటేశ్వర్లు, గుజ్జుల యల్లమందారెడ్డి, ఏ. ఈశ్వర రెడ్డి, కె. రాములు ప్రసంగించారు. శ్రీ యం. సి. వెంకటేశ్వర్లు నివేదిక ప్రవేశపెట్టారు.

నాగార్జునసాగరు నీరు, కందుకూరు, కనిగిరి, పొదిలి తాలూకాలకు వెంటనే కాల్వలను ప్రారంభించి పనులు చేయాలి. 18 సంవత్సరాలు నిండిన యువకులకు ఓటు హక్కు ఉండాలని యింకా తదితర తీర్మానాలను మహాసభ చేసింది

మహాసభ నూతన కార్యవర్గాన్ని 21 మందితో ఎన్నుకున్నారు.

అధ్యక్షులుగా శ్రీ వి. రామస్వామి, ఉపాధ్యక్షులుగా శ్రీ కె. హరిశ్చంద్రారెడ్డి, కార్యదర్శిగా శ్రీ యం. సి. వెంకటేశ్వర్లు, సహాయ కార్యదర్శిగా శ్రీ బాలయ్య (పైడిపాడు), కోశాధికారిగా శ్రీ కె. అరుణను ఎన్నుకున్నారు.

కందుకూరు ప్రజా నాట్యమండలి వారికోత్సవాలు

కందుకూరు, ఏప్రిల్ 12

ప్రకాశంజిల్లా కందుకూరు ప్రజా నాట్య మండలి తృతీయ వార్షికోత్సవాల సందర్భంగా నిర్వహించిన 3 రోజుల నాటిక పోటీలు జయప్రదంగా ముగిశాయి. ఉత్సవాలను శ్రీ ఎ. పుల్లారెడ్డి ప్రారంభించారు.

శ్రీ నల్లూరి వెంకటేశ్వర్లు, రాష్ట్ర ప్రజా నాట్య మండలి కన్వీనరు శ్రీ మోహనదాసు, కొండపి శాసన సభ్యులు శ్రీ దివి కొండయ్యలు ప్రజా నాట్య మండలి కార్యక్రమాలను గూర్చి, ప్రజా నాట్యమండలి ద్వారా కళకు, ప్రజలకు చేస్తున్న సేవను గూర్చి వివరించారు.

రెండవరోజు ప్రారంభంలో అభ్యుదయ రచయిత శ్రీ గజ్జల మల్లారెడ్డి నాటకాలు, రచనలను గురించి వివరిస్తూ ప్రజలకొరకు పనికివచ్చేవిగా రచనలను ఎన్నుకొని ప్రదర్శించాలని వివరించారు

సృజన ఆర్ట్సు థియేటరువారి "సంతా" ఉత్తమ నాటికగా, ప్రోగ్రెసివ్ హైస్కూలు యువ, కొండవారి "కాల్ ది [illegible]" ద్వితీయ ఉత్తమ నాటికగాను ఎన్నుకోబడ్డవి.

విశాలాంధ్ర ఆవరణలో సభ

విజయవాడ, ఏప్రిల్ 12

ఆసియా శాంతి వారోత్సవాలకు సంఘీభావంగా నేటిరాత్రి 8 గంటలకు విశాలాంధ్ర ఆఫీసు ఆవరణలో పట్టణ కమ్యూనిస్టు సమితి ఆధ్వర్యాన జరిగిన సభకు 31 వ వార్డు కమ్యూనిస్టు శాఖ కార్యదర్శి శ్రీ అప్పలనాయుడు అధ్యక్షత వహించారు. ప్రపంచ శాంతి, సౌభ్రాతృత్వం ఎంత ముఖ్యమైనవో వివరిస్తూ పట్టణ యువజన సంఘ కార్యదర్శి శ్రీ వెంకట నారాయణ, ప్రముఖ లాయరు శ్రీ కిలారు శ్రీనివాసమూర్తి ప్రసంగించారు.

వినుకొండలో

వినుకొండ, ఏప్రిల్ 13

ఆసియా వారోత్సవాలను పురస్కరించుకొని వినుకొండలో పట్టణ ఇస్కస్, గుంటూరుజిల్లా శాంతిసంఘం ఆధ్వర్యాన సభ జరిగింది.

సభకు ఆంధ్రప్రదేశ్ అభ్యుదయ రచయితల సంఘ అధ్యక్షులు శ్రీ గంగినేని వెంకటేశ్వరరావు అధ్యక్షత వహించారు. పట్టణ ఇస్కస్ ప్రధాన కార్యదర్శి శ్రీ వి రాధాకృష్ణమూర్తి సభా ప్రాముఖ్యతను వివరించి స్వాగతం చెప్పారు.

కమ్యూనిస్టు నాయకులు శ్రీ పి. వి. శివయ్య ప్రసంగిస్తూ పెట్టుబడిదారులకు సామ్రాజ్యవాదులకు వ్యతిరేకంగా పోరాడాలన్నారు. దేశంలోని సామ్రాజ్యవాదుల ఆటలను ఒక కంట కనిపెట్టాలన్నారు.

సామ్రాజ్యవాదుల తత్త్వాన్ని ముక్తకంఠంతో ఖండించి ఎదుర్కొనకపోతే ఆసియా భద్రతకు ముప్పు కలగగలదని హెచ్చరించారు.

గుంటూరుజిల్లా శాంతి సంఘ అధ్యక్షులు శ్రీ డి. వి. అప్పారావు, ఆసియా వారోత్సవాల ప్రాముఖ్యతను వివరించారు.

శ్రీ వి. రాధాకృష్ణమూర్తి వందన సమర్పణ అనంతరం సోవియట్ ఫిలిం ప్రదర్శించబడింది.

మైలవరం రాగి గనుల స్వాధీనం

మైనింగ్ కార్పొరేషన్‌చే

కొత్తగూడెం, ఏప్రిల్ 11

మైలవరం రాగి ప్రాజెక్టును త్వరలో ఆంధ్రప్రదేశ్ మైనింగ్ కార్పొరేషన్ చేపడుతుంది.

ఈ ప్రాజెక్టు ప్రస్తుతం ఇండియన్ బ్యూరో ఆఫ్ మైన్స్ ఆధీనంలో వున్నది.

పదిహేను చదరపు కిలోమీటర్ల విస్తీర్ణంలో రాగిగనులు విస్తరించి వున్నాయని, 15 సంవత్సరాల పాటు త్రవ్వకానికి యివి అనువుగా వున్నాయని అధికార ప్రతినిధి అన్నారు. మైలవరం గనుల్లో రెండు నుండి మూడు శాతం వరకు రాగి లభిస్తుంది.

లారీ ప్రమాదంలో ఇద్దరి మృతి

హైదరాబాద్, ఏప్రిల్ 12

హైదరాబాద్‌నుండి విజయవాడ వస్తున్న ఒక లారీ మొన్న కంచికచర్ల వద్ద నిలబడి వున్న మరో లారీని ఢీ కొనడంతో ఇద్దరు వ్యక్తులు అక్కడికక్కడే మరణించారు. మరో 5 గురు గాయపడ్డారు.

హైదరాబాద్ నుండి వస్తున్న లారీ కంచికచర్లలో నిలబడివున్న లారీని ఢీ కొనడంతో నిలబడి వున్న లారీ ముందుకు జరిగి లారీ క్రింద విశ్రమిస్తున్న క్లీనర్ పైగా పోవడంతో అతను మరణించాడు. హైదరాబాద్ నుండి వచ్చే లారీలోగల ఒక ప్రయాణీకుడు కూడా అక్కడికక్కడే మరణించాడు.

హైదరాబాద్ నుండి వచ్చే లారీ డ్రైవర్‌తో సహా మొత్తం 5 గురు వ్యక్తులు ఈ ప్రమాదంలో గాయపడ్డారు.

ముమ్మిడివరం గర్ల్స్ హాస్టలు దుస్థితి

బాధలు పడలేక విద్యార్థినుల పలాయనం

ముమ్మిడివరం, ఏప్రిల్ 12

తూర్పుగోదావరిజిల్లా ముమ్మిడివరం లోని ప్రభుత్వ బాలికల హాస్టలులో బాధలు భరించలేక 28 మంది విద్యార్థినులలో 18 మంది హాస్టలు విడిచి వెళ్ళిపోయారు.

ఇక మిగిలిన పదుగురు గత్యంతరంలేక ఉంటున్నారు.

ఈ హాస్టలు మ్యాట్రన్ ప్రభుత్వ కేటాయింపుల ప్రకారం యివ్వవలసిన పదార్థాలు యివ్వకుండా విద్యార్థినులను మాడ్చుతూ అన్ని విధాలా అసౌకర్యాలను కల్గిస్తున్నది. ఈ విషయాలను పై అధికారులకు ఎన్ని సార్లు నివేదించినా ఎవరూ పట్టించుకోవటం లేదని విద్యార్థినులు తెలుపుతున్నారు.

ప్రదేశ్ విద్యార్థి సమాఖ్య తాత్కాలిక ప్రధాన కార్యదర్శి

హైదరాబాద్, ఏప్రిల్ 13

అఖిలభారత విద్యార్థి సమాఖ్య ప్రధాన కార్యదర్శిగా ఎన్నికైన శ్రీ అతీక్‌పాషా స్థానే శ్రీ కె. నారాయణ ఆంధ్రప్రదేశ్ విద్యార్థి సమాఖ్య ప్రధాన కార్యదర్శి బాధ్యతలను నిర్వహిస్తారు.

ట్రైన్‌తో కారు ఢీ; 14 మంది మృతి

ట్యునిస్, ఏప్రిల్ 13

ట్యునీషియాలో ఎన్ఫిదా వద్ద చిన్న ట్రైన్‌ను మోటారుకారు ఢీ కొనడంతో 14 మంది మరణించారు, 28మంది గాయపడ్డారు.

కల్తీపాలు అమ్మిన నేరానికి 8 వారాలు శిక్ష

విజయవాడ, ఏప్రిల్ 12

కల్తీపాలు అమ్మిన నేరానికి శ్రీ బెజవాడ సుబ్బారావుకు రు. 500 జరిమానా విధించబడింది. జరిమానా చెల్లించకపోతే 8 వారాలు జైలు శిక్ష అనుభవించాలి

పై కేసును విజయవాడ మున్సిపల్ ఫుడ్ ఇన్స్‌పెక్టర్ 3 వ అడిషనల్ ఫస్టుక్లాస్ మేజిస్ట్రేట్ కోర్టులో దాఖలు చేయగా కోర్టు విచారణ జరిపి పై శిక్షను విధించింది.

కల్తీ కారంపొడి అమ్మినందుకు శిక్ష

కల్తీ కారంపొడి అమ్మినందుకు శ్రీ చిట్టూరి రంగమార్తాండమూర్తికి, శ్రీ ప్రత్తి సీతారామయ్యకు 2 సంవత్సరాల జైలుశిక్ష రు. 2వేలు జరిమానా విధించబడింది. జరిమానా చెల్లించకపోతే 4 నెలలు అదనంగా జైలుశిక్ష అనుభవించాలని కోర్టు తీర్పు ఇచ్చింది.

గుంటూరులో త్వరలో ఆటోటెలెక్స్ కేంద్రం

గుంటూరు, ఏప్రిల్ 13

అతి త్వరలో గుంటూరు పట్టణములో 50 లైన్లతో "ఆటో టెలెక్స్" కేంద్రం నెలకొల్పడానికి అవసరమైన యేర్పాట్లు చేయబడ్డాయి. ఈ ఆటోటెలెక్స్ కేంద్రం 1974-75 సంవత్సరంలో పనిచేయడం ప్రారంభిస్తుంది. తద్వారా గుంటూరు నుండి దేశములోని అన్ని టెలెక్స్ కేంద్రాలకు నేరుగా సంబంధములు ఏర్పాటు కాగలవని భారత తంతి - తపాలా బోర్డువారు తమకు తెలిపినట్లు గుంటూరు ఇండియన్ ఛాంబర్ ఆఫ్ కామర్సు గౌరవ కార్యదర్శి శ్రీ వనమా పూర్ణచంద్రరావు తెలియజేశారు.

గిరిజన ప్రాంతాల్లో పోలీసు దౌర్జన్యాలు

విచారణ జరపాలని డిమాండ్

హైదరాబాద్, ఏప్రిల్ 1

ఖమ్మం జిల్లా గిరిజన ప్రాంతాలలో పోలీసుల దౌర్జన్యకాండను గురించి ఉన్నత స్థాయి అధికారులతో విచారణ జరిపించాలని కాంగ్రెస్ శాసన సభ్యులు శ్రీ చేకూరి కాశయ్య డిమాండు చేశారు.

నిన్న ఆయన ప్రభుత్వానికి సమర్పించిన ఒక వినతి పత్రంలో ఇటీవల నక్సలైట్ అనే పేరుతో ఒక గిరిజనుణ్ణి పోలీసులు చంపివేయడం పథకం ప్రకారం జరిగిందని తెలిపారు.

పోలీసులు గిరిజన గ్రామాల్లో కోళ్ళు [illegible] దోచుకొని పోయారని, గిరిజన స్త్రీలపై అత్యాచారాలకు పాల్పడ్డారని ఆ మెమోరాండంలో పేర్కొన్నారు.

ఆయన ఆ ప్రాంతంలో పర్యటించినట్లు, విచారణకైనా సాక్ష్యమివ్వడానికి సిద్ధంగా వున్నానని తెలిపారు.

సారాయి అక్రమ రవాణాదార్ల అరెస్టు

కాకినాడ, ఏప్రిల్ 12

యానాం, కాకినాడలమధ్య తిరిగే బస్సులో అక్రమంగా రవాణా అవుతున్న సారాయిని కాకినాడ ఎక్సైజు సూపరింటెండెంటు శ్రీ యం. నారాయణ, సర్కిల్ ఇన్స్‌పెక్టరు శ్రీ వి. సాంబశివరావు సబ్ఇన్స్‌పెక్టరు శ్రీ కె. వెంకయ్యల సహాయంతో శాస్త్రిపురంవద్ద గత సోమవారం పట్టివేశారు.

ఈ సందర్భంగా బస్సు యజమానిని, డ్రైవరును, క్లీనరును, కండక్టరును అరెస్టు చేశారు. బస్సు నెంబరు ఎ. పి. పి. 6333.

భగ్న ప్రేమికుల ఆత్మహత్య

కాకినాడ, ఏప్రిల్ 12

ఉమ అనే 18 సంవత్సరాల యువతి, సురేష్ అనే 20 సంవత్సరాల యువకుడు ఈ నెల 9 న ఎండ్రిన్ త్రాగి చనిపోయారు.

ఉమ వైశ్యబాలిక, సురేష్ క్రిష్టియన్. వీరి వివాహానికి పెద్దల సమ్మతి లభించనందువల్ల ఆత్మహత్యకు పాల్పడ్డట్లు తెలుస్తున్నది.

తిరుపూరులో అగ్నిప్రమాదం

తిరుపూరు, ఏప్రిల్ 10

తిరుపూరులో యీ నెల 3 న అగ్ని ప్రమాదం సంభవించి పది ఇళ్ళు పూర్తిగా దగ్ధమయ్యాయి.

ఇళ్ళలోని వస్తువులేమీ దక్కలేదు సుమారు 10 వేల నష్టం జరిగి వుంటుంది.

సంపత్ కుమార్ నృత్య ప్రదర్శనలు

తిరుపూరులో అభ్యుదయ వేదిక సాంస్కృతిక విభాగం ఆధ్వర్యాన సంపత్ కుమార్ బృందంచే నృత్య ప్రదర్శనలు ఏర్పాటు చేయబడ్డాయి

ప్రదర్శనల అనంతరం అభ్యుదయ వేదిక గౌరవాధ్యక్షులు శ్రీ టి. వి. నరసింహారావు, కార్యదర్శి శ్రీ జి దుర్గాప్రసాదరావు, అడ్వొకేటు గోపాలనాగేశ్వరరావు ప్రసంగించారు. కళాకారులను పరిచయం చేశారు.

విర్‌పూర్ కాల్పుల్లో ఒకరి మృతి

రాజ్‌కోట్, ఏప్రిల్ 12

ఇక్కడికి 60 కిలోమీటర్ల దూరంలో గల ప్రముఖ యాత్రాకేంద్రం విర్‌పూర్‌లో నిన్న పోలీసులు జరిపిన కాల్పులలో ఒక వ్యక్తి మరణించారు, మరొకరు గాయపడ్డారని ఇక్కడికి అందిన అధికార వార్తల ద్వారా తెలుస్తున్నది.

పట్టణంలో మంచినీటి కొరత సమస్యను చర్చించేందుకు పుర ప్రముఖులు సమావేశమయ్యారు. సమావేశంవద్ద వెయ్యిమంది ప్రజలు గుమికూడారు. వారిలో ఖాళీ బిందెలు ధరించిన 60 మంది మహిళలు గుండెలు కొట్టుకోవడం ప్రారంభించారు. ప్రజాసమూహం కొంతసేపు సమావేశంపై రాళ్ళు విసిరారు. వారిని చెదరగొట్టేందుకు పోలీసులు లాఠీచార్జి జరిపారు. ఫలితంలేక పోగా కాల్పులు జరిపారు. ప్రస్తుతం పట్టణంలో పరిస్థితి మామూలుగా వుంది.

త్రైపాక్షిక ఒప్పందంపట్ల ప్రావ్దా హర్షం

మాస్కో, ఏప్రిల్ 12

ఢిల్లీ త్రైపాక్షిక ఒప్పందం ప్రముఖమైన అంతర్జాతీయ ఘటనమని సోవియట్ కమ్యూనిస్టుపార్టీ పత్రిక ప్రావ్దా హర్షం ప్రకటించింది.

సమావేశంలో పాల్గొన్నవారు "గణనీయమైన విభేదాలు అధిగమించి, 70 కోట్ల ప్రజానీకం నివసించే ప్రాంతం ప్రయోజనాలకు అనుగుణంగా నిర్ణయాలు తీసుకొని సుహృద్భావం ప్రకటించారని" ప్రావ్దా ప్రశంసించింది.

"ఇప్పుడా ఖండంలో భద్రత, సుస్థిర శాంతిని హామీ కల్పించే మార్గాలకోసం ప్రజలు తీవ్రంగా అన్వేషిస్తున్నారు. భారత పాకిస్తాన్, బంగ్లాదేశ్‌లమధ్య సాధారణ సంబంధాలు లేర్పడడమంటే ఈ అన్వేషణ మార్గంలో అతి ముఖ్యమైన అడుగు అని వారు భావిస్తున్నారు" అని ప్రావ్దా తెలిపింది.

పెద్ద నగరాలలో అత్యవసర వస్తువుల అక్రమ నిల్వలు

న్యూఢిల్లీ, ఏప్రిల్ 12

అత్యవసర వస్తువులను అక్రమంగా నిల్వ చేయటానికి, దొంగ రవాణాకు ఢిల్లీ, బొంబాయి, మద్రాసు, కలకత్తా వంటి పెద్ద నగరాలు కేంద్రాలయ్యాయని భారత వినియోగదారుల మండలి జరిపిన సర్వేలో వెల్లడైంది.

ఆహారధాన్యాలనుండి సిమెంట్‌వరకు ప్రతివస్తువు ఎక్కువగానే లభ్యమవుతున్నది. అయితే కల్తీచేయటం, బ్లాక్ మార్కెట్ రేటుకు అమ్మటం జరుగుతున్నది అని ఆ సర్వే తెలిపింది.

టెలిగ్రాఫ్ తీగల దొంగతనాలవల్ల రూ. 7 కోట్లు నష్టం

అంచనాల కమిటీ వెల్లడి

న్యూఢిల్లీ, ఏప్రిల్ 11

1969-70 నుండి 1971-72 సంవత్సరాలలో జరిగిన రాగి తీగె దొంగతనాలవల్ల ప్రభుత్వ ఖజానాకు దాదాపు రు. 7 కోట్ల నష్టం సంభవించినట్లు పార్లమెంటు అంచనాల కమిటీ ఆందోళన వెలిబుచ్చింది.

కమిటీ నివేదిక నేడు పార్లమెంటుకు అందచేయబడింది.

టెలిగ్రాఫ్ తీగెలను దొంగిలించేవారిని తీవ్రంగా శిక్షించుటకు వీలుగా, కాలంచెల్లిన 1950 టెలిగ్రాఫ్ వైర్సు చట్టాన్ని సవరించాల్సిన అవసరాన్ని గురించి ప్రభుత్వం 8 సంవత్సరాల క్రితం సవరణబిల్లును ప్రవేశపెట్టడం జరిగిందని, ఆ బిల్లును 1966లో రాజ్యసభ ఆమోదించడం జరిగినప్పటికీ, మూడవ లోక్‌సభ రద్దు అయిన దృష్ట్యా బిల్లును అంతవరకు ఆమోదించడం జరగలేదని అంచనాల కమిటీ తెలియజేసింది.

1968 నుండి ప్రభుత్వం ఈవిషయంలో శ్రద్ధతీసుకోలేదని, ఇకముందు అత్యంత ప్రాధాన్యమైన ఈ బిల్లును తేవడంలో ఎంత మాత్రం ఆలస్యం చేయరాదని తెలియ చేసింది.

ప్రభుత్వం ఇందుకు సమాధానంగా తంతి తపాలా చట్టానికి తేవాల్సిన ఇతర సవరణలతోపాటు 1974 లో పార్లమెంటు సమావేశం సవరణ బిల్లును ప్రవేశ పెట్టడం జరుగుతుందని తెలియ చేసింది.

లోక్‌సభ ఘటనలపై జయప్రకాష్ ఖండన

న్యూఢిల్లీ, ఏప్రిల్ 12

రెండు పిస్తోలు, ఒక ట్రాన్సిస్టర్ బాంబును ధరించిన బీహార్‌కు చెందిన యువకుడు బలవంతంగా లోక్‌సభలోకి ప్రవేశించడానికి ప్రయత్నించిన ఘటనను శ్రీ జయప్రకాష్ నారాయణ నేడిక్కడ ఒక ప్రకటనలో ఖండించారు.

పూర్తి దర్యాప్తు జరిపేవరకు ఆ యువకుని ఉద్దేశ్యాలేమిటో చెప్పటం కష్టమని ఆయనన్నారు

ఆయన ఉద్దేశ్యాలు న్యాయమైనవయినా, తన భావాలను వ్యక్తం చేసేందుకు అతను అనుసరించిన మార్గం గర్హనీయమైనదని ఆయనన్నారు.

గోల్డా మీర్ రాజీనామా సమర్పణ

జెరూసలెం, ఏప్రిల్ 11

ఇస్రాయిల్ ప్రధాని శ్రీమతి గోల్డామీర్ తన రాజీనామాను నేడు దేశాధ్యక్షుడు ఇఫ్రెం కట్జిర్‌కు సమర్పించారు.

శ్రీమతి మీర్ సేవలను అధ్యక్షులు ప్రశంసించారు

నూతన ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడానికి వివిధ పార్టీల నాయకులతో ఆయన చర్చలు జరుపుతున్నారు.

గెరిల్లాలు

ఇస్రాయిల్‌పై కాల్పులు జరిపి రెండు భవనాలను స్వాధీనం చేసుకున్న అరబ్ గెరిల్లాలను ఇస్రాయిల్ దళాలు చుట్టి పెట్టాయని ఇస్రాయిల్ రేడియో ప్రకటించింది.

10 మంది ఇస్రాయిలీలను గెరిల్లాలు వధించారని, మరొక 10 మంది గాయపడ్డారని తెలిపింది.

సినిమాథియేటర్లకు లైసెన్సుల వ్యవహారం

అధికార్లకు ఆదేశాలు

విజయవాడ, ఏప్రిల్ 12

ఆంధ్రప్రదేశ్ సినిమాల క్రమబద్ధీకరణ నిబంధన 14 (2) కింద థియేటర్లకు అయిదేళ్ళకుకాక అంతకు తక్కువ వ్యవధికి కానీ దరఖాస్తుపై లైసెన్సులు జారీచేయవచ్చునని ఇందుకు సంబంధించిన విచక్షణాధికారం ఆయా ప్రాంత అధికారులకు ఇవ్వబడిందని తెలుపుతూ ప్రభుత్వం ఉత్తర్వు చేసింది.

అయిదేళ్ళకు లోపు వ్యవధికి లైసెన్సు జారీచేసే సమయంలో అధికారులు అందుకు తగినకారణాలు తెలపవలసివుంటుందని, ఈవిషయమై అధికారులు భవిష్యత్తులో ఇక ఎలాంటి రాయబారాలకు తావు ఇవ్వకుండా నిబంధనలను పాటించాలని ఉత్తరువులో పేర్కొన్నారు.

శ్రీ కన్నెకంటి వీరభద్రాచార్యులు మృతి

మోర్జంపాడు, ఏప్రిల్ 12

పల్నాటి సోదర కవులలో కనిష్ఠులు శతావధాని శ్రీ కన్నెకంటి వీరభద్రాచార్యులు ఈ నెల 3 న స్వగృహంలో మరణించారు. ఆయన వయస్సు 58.

ఆయన నవభారతం, శ్రీశైలమహోత్సవం మొదలైన గ్రంథాలు రాశారు. జాతీయోద్యమంలో పాల్గొన్నారు. అనేకచోట్ల అష్టావధానాలు, శతావధానాలు చేశారు.

అస్సాంకు 12 వేల టన్నుల గోధుమ సరఫరా

ఏప్రిల్ నెలలో

న్యూఢిల్లీ, ఏప్రిల్ 12

అస్సాంకు ప్రతినెలా కేంద్రం సరఫరా చేసే గోధుమలకన్నా అదనంగా 3 వేల టన్నులను ఏప్రిల్‌నెలలో సరఫరా చేయడానికి నిర్ణయించింది. దీనితో మొత్తం 12 వేల టన్నుల గోధుమల సరఫరా జరుగుతుంది.

ఈ విషయాన్ని రాష్ట్ర ముఖ్యమంత్రి శ్రీ ఎస్. సి. సిన్హా పత్రికలవారికి తెలియ చేస్తూ, రాష్ట్రంలో ధాన్యసేకరణకు లక్ష్యంగా నిర్ణయించిన 20 లక్షల క్వింటాళ్ళు సేకరణ పూర్తికాగలదని తెలిపారు.

గత సంవత్సరం 12 లక్షల క్వింటాళ్ళ ధాన్యం సేకరించగా, ఈ సంవత్సరం ఇంతవరకు 17 లక్షల క్వింటాళ్ళు సేకరించబడినట్లు, మిగతా ధాన్యం ఎండా కాలంలో పండే పంటనుండి సేకరించబడుతుందని తెలిపారు.

సభలు-సమావేశాలు

అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా గుంటూరు పట్టణ మహిళల సమావేశం ఈ నెల 14 వ తేదీ సాయంత్రం 5 గంటలకు గుంటూరులో ఇన్నీసు మేడపై జరుగుతుంది.

* * * *

మచిలీపట్నం డివిజన్ ఎల్. ఐ. సి. బ్రాంచి మేనేజర్స్ మహాసభ ఈనెల 18 న విజయవాడలోని నటరాజ హోటల్ కాన్ఫరెన్స్ హాలులో ఉదయం 10 గంటలకు జరుగుతుంది.

* * * *

ఖాదీ మరియు గ్రామీణ పరిశ్రమల ఎగ్జిబిషన్‌ను ముఖ్యమంత్రి శ్రీ జె. వెంగళరావు ఈ నెల 14 వ తేదీ సాయంత్రం 6 గంటలకు విజయవాడలోని గాంధీజీ మున్సిపల్ హైస్కూలు గ్రౌండ్సులో ప్రారంభోత్సవం చేస్తారు.

* * * *

విశాఖజిల్లా వ్యవసాయ కార్మిక సంఘ కార్యవర్గ సమావేశం ఈనెల 20 న జిల్లా కమ్యూనిస్టుపార్టీ ఆఫీసులో ఉదయం 10 గంటలకు జరుగుతుంది.

* * * *

మచిలీపట్నం ఆంధ్ర సారస్వత సమితి ఆధ్వర్యాన ఈ నెల 14 సాయంత్రం ఆరు గంటలకు మున్సిపల్ పార్కులోని హాలులో సాహిత్య సభ జరుగుతుంది.

* * * *

గుంటూరు ఆంధ్ర క్రిస్టియన్ కాలేజీ 88 వ వార్షికోత్సవం ఈనెల 15 న సాయంత్రం 4.30 గంటలకు కాలేజి ఆవరణలో జరుగుతుంది.

* * * *

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఎక్స్-రే టెక్నీషియన్ల అసోసియేషన్ సమావేశం గుంటూరులో యీనెల 13, 14 తేదీలలో జరుగుతుంది.

* * * *

రాష్ట్ర అడ్వొకేట్ల గుమాస్తాల ఫెడరేషన్ సర్వసభ్య సమావేశం 2-5-74న విజయవాడ సివిల్‌కోర్టు ఆవరణలో విజయవాడ అడ్వొకేటు గుమాస్తాల సహకారంతో జరుగుతుంది. జిల్లా ప్రతినిధులు, తాలూకా సభ్యులు హాజరుకావాలని అధ్యక్షులు శ్రీ కె. యల్. నరసింహారావు, కార్యదర్శి శ్రీ వై. వెంకటేశ్వరరావు కోరుచున్నారు. సభకు హాజరగు ప్రతినిధులు, సభ్యులు రు. 5 ప్రతినిధి రుసుం చెల్లించాలి.

ఏజెంట్లు కావలెను

1975 బొమ్మల క్యాలెండర్లకు ఆర్డర్లు చేయుటకు ఏజెంట్లు కావలెను. 160 డిజైనులు, మంచి కమీషన్, ఉచిత వివరాలకు వ్రాయండి.

LION OFFSET WORKS,
Post Box 183, SIVAKASI.

EDUCATIONAL

Account Test (Andhra Pradesh) Previous years Questions with Answers and Guides for: Part I, II; Executive Officers & P.W.D. Officers' Tests available. Prospectus free. Account Test Institute, 12/1-B, Police Commissioner's Office Road, Egmore, Madras-600008.

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వము
మెడికల్ అండ్ హెల్తుశాఖ
స్టేట్ హెల్తు ట్రాన్స్‌పోర్ట్ ఆర్గనైజేషన్
సంజీవరెడ్డినగర్, హైదరాబాద్-38

టెండర్ నోటీసు
నెం. 3439/Y5/74

వర్క్‌షాప్ ఇంజనీర్ మొబైల్ మెయింటెనెన్స్ యూనిట్, విశాఖపట్నం వారి కార్యాలయం ఆవరణలో ఉన్న పనికిరాని 6 వెహికల్సు వేలం గురించి టెండరు నోటీసు ఆర్.సి. నెం. 3439/y5/74 తేదీ 6.3.1974 లోని టెండర్లు తీసుకొను తేదీని 30-4-1974 సాయంత్రం 3 గంటల వరకు పొడిగించటమైనది.

(సం) కె. శంకరనారాయణరెడ్డి
స్టేట్ హెల్త్ ట్రాన్స్‌పోర్ట్ ఆఫీసు.

విశాఖపట్నం పోర్టు ట్రస్టు

టెండరు నోటీసు

"మల్కాపురం వద్ద క్వార్టర్లకు విశిష్టమైన శౌచాలు, ఎక్స్‌టర్నల్ వాటర్ సప్లయితో సెప్టిక్ టాంకు నిర్మాణమునకు" అనుభవము గల కాంట్రాక్టర్ల నుండి సీలువేసిన టెండర్లు నిర్ణీత ఫారములో కోరబడుచున్నవి. ఎస్టిమేషన్ మొత్తం రు. 22,677/- టెండర్లు ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ (యం), విశాఖపట్నం పోర్టు ట్రస్టు వారిచే 24.4.74 సాయంత్రం 3.00 గంటల వరకు స్వీకరింపబడును. టెండర్లు అదే రోజు సాయంత్రం గం. 3.05 లకు అప్పటికి హాజరైన టెండరుదార్ల సమక్షంలో టెండరు కమిటీచే తెరువబడును.

2. టెండరు ఫారములు, స్పెసిఫికేషన్లు హెచ్చులు ఫైనాన్షియల్ అడ్వయిజర్ & చీఫ్ అకౌంట్సు ఆఫీసర్ విశాఖపట్నం పోర్టుట్రస్టు (రెవిన్యూ ఎర్నింగ్ సెక్షన్) వారికి టెండరు ఫారముల సెట్టొకటికి రు. 10/- (పది రూపాయలు మాత్రం) నగదు చెల్లించి పొందవచ్చును. ఫైనాన్షియల్ అడ్వయిజర్ & చీఫ్ అకౌంట్సు ఆఫీసర్, విశాఖపట్నం పోర్టుట్రస్ట్ వారినుండి పొందిన నగదు చలానాను టెండరు షెడ్యూళ్ళ కొరకు ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ (యం.) విశాఖపట్నం పోర్టు ట్రస్టువారికి పెట్టుకొను దరఖాస్తుకు జతపరచి పంపాలి. దరఖాస్తులో 1) డిపాజిట్ చేసిన పనిపేరు ii) టెండరు పెట్టదలచు అభిలాషగల టెండరుదారు పేరు iii) చిరునామా స్పష్టంగా వ్రాయాలి.

3. టెండరు ఫారముల ఖరీదును మనీ యార్డరుద్వారా పంపదలచినచో టెండరు ఫారములు, కావలసిన పని పేరు మనియార్డరు కూపనులో స్పష్టంగా వ్రాయాలి. స్పష్టమైన వివరాలు ఇవ్వలేకపోయినట్లయితే టెండరు పేపర్లు జారీ చేయటమన్నచో పోర్టుట్రస్ట్‌వారు బాధ్యులు కారు.

4. టెండర్లు తెరచుటకు నిర్ణయించిన తేదీన టెండరు పేపర్లు జారీచేయబడవు.

5. అభిలాషగల టెండరుదార్లు ఇలాంటిపనినే గతమూడు సంవత్సరాలలో రు. 23,000/- లకు తక్కువ లేకుండా చేసినట్లు ఋజువుపరచు పత్రములను దాఖలు చేయాలి ఈ ఋజువాతం టెండరు ఫారముల కొరకు పెట్టుకొను దరఖాస్తుతో కూడ జతపరచి పంపాలి. అట్లుపంపనిచో టెండరు పేపర్లు జారీచేయబడవు కట్టిన మొత్తం తిరిగి ఇవ్వబడదు

6. పై దానితో సంబంధం లేకుండానే ఎట్టి కారణం తెలుపకనే ఏ పార్టీకైనా టెండరు పేపర్లు జారీ చేయకుండా ఉండు అధికారం ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ (యం) వారికి కలదు.

ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ (యం)

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వము
ప్రజాపనుల శాఖ
నెల్లూరుసర్కిల్ సూపరింటెండింగ్ ఇంజనీరువారి కార్యాలయం, నెల్లూరు.

చిట్ టెండరు నోటీసు 6/73-74కు సవరణ

పని పేరు: నెల్లూరుజిల్లా నెల్లూరు తాలూకాలోని సర్వేపల్లి రిజర్వాయరునుంచి ఇడిమేపల్లి బొగికాలువరకు వేరుపులకు క్రొత్త కాలువల త్రవ్వకం.

	ఇదివరలో ప్రకటించిన మేరకు	సవరణ
టెండరు పెట్టుటకు కాంట్రాక్టర్లకు కావలసిన అర్హత	I మరియు II తరగతులలో రిజిష్టరు కాబడిన కంట్రాక్టరు.	I, II, III తరగతులలో రిజిష్టరు కాబడిన కంట్రాక్టర్లు

కె. మునెలయ్య,
సూపరింటెండింగ్ ఇంజనీరు.

బీహార్ పరిణామాలు

(4 వ పేజీ తరువాయి)

పోవటానికి దారి వేసుకగల కారణాలను లోతుగా పరిశీలించవలసివుంది. ఈ ఘటనలు జరిగినరోజు ఉదయం ఎడిషన్‌లోనే ఆర్యావర్త కూడా సర్చ్‌లైటుకు సంబంధించిన ఒక వార్తను ప్రచురించింది.

"విద్యార్థి ఉద్యమ నాయకత్వాన్ని కొన్ని ప్రతిపక్షపార్టీల నాయకులు స్వీకరించినట్లు తెలియవచ్చింది. దర్భంగాలో ఒక ప్రముఖ కాంగ్రెసు నాయకుడు కూడా పాల్గొన్నట్లు చెప్పబడుతున్నది. నిన్నటినుండి (అనగా మార్చి 17) ఒక కాంగ్రెసు నాయకునితో సిండికేట్ మరియు ఎస్. ఎస్. పి. నాయకులు చాలాసార్లు కలిసినట్లు తెలిసింది. ఈ ఒప్పంద సందర్భంగా "తమ మనుష్యులు" కూడా ప్రదర్శనలో పాల్గొంటారనీ, అదే సమయంలో వారు మంత్రులపై కూడా నిఘా వుంచుతారని కాంగ్రెస్ నాయకుడు హామీ యిచ్చినట్లు తెలిసింది. (మార్చి 18)

ఈ వార్తను ఎవరూ ఖండించలేదు. నేటివరకు యింకా ఖండించబడకుండానే వుంది.

మితవాదుల కుట్ర

ఈ విధంగా మార్చి 18 న పాట్నాలోనూ మరువటి రెండు రోజుల్లో బీహారు అంతటా జరిగిన ఘటనలు సామాన్యమైనవికావు. పోలీసులతోనూ సైన్యంతోనూ అణచివేయవలసిన ఈ పథకం ప్రకారం జరిగిన లూటీలు, గృహదహనాలకు హింసాకాండకు ఆగ్రహావేశులైన విద్యార్థులు పాల్పడలేదు. బీహార్ అంతటా లూటీలు, గృహదహనాలు అరాచకం సృష్టించటంద్వారా పార్లమెంటరీ ప్రజాస్వామ్యాన్ని ధ్వంసంచేసి పాసిస్టు నిరంకుశత్వాన్ని అధికారంలో కూర్చోబెట్టటానికి మితవాదులు పన్నిన లోతైన కుట్ర ఇది.

ఈ పథకాలను జనవరిలోనే సిద్ధం చేయటం జరిగింది. ఆర్. ఎస్. ఎస్. వ్యక్తులు వ్రాసినటువంటి అందుకు సంబంధించిన లేఖల ఫోటోస్టాట్ కాపీలు కమ్యూనిస్టుపార్టీవద్ద వున్నాయి. శాసనసభలో గవర్నర్ ప్రసంగించకుండా నిరోధించాలనీ, శాసనసభ పని చేయకుండా చేయాలనీ, వార్తాపత్రికలు ఎటువంటి వార్తలు ప్రచురించకుండా చేయాలనీ, పరిపాలనా వ్యవస్థను ఛిన్నాభిన్నంచేసి ఆ తరువాత "శాంతియుతంగా" అధికారాన్ని చిక్కించుకోవాలనేది లక్ష్యంగా పెట్టుకున్న పథకాలు యివి.

ఈ పథకంను నిర్దిష్టం చేయటానికి అవసరమైనవారిని జాగ్రత్తగా ఆర్.ఎస్.ఎస్ ఆనంద్‌మార్గ్‌లనుండి పాట్నా కొన్ని ఇతరపట్టణాలకు చెందిన దుండగులనుండి ఎన్నుకున్నారు. వీరు నొసటిపై ఎర్ర చందనం పూత. మెడలో పూలమాల, ఇంకా ముఖాన్ని సగంవరకు కప్పే ఒక విధమైన ముసుగు కలిగివున్నారు. ఒక ప్రత్యక్ష సాక్షి కథనం ప్రకారం "మోటారు సైకిల్‌పైగల యిద్దరు వ్యక్తులు సెర్చ్‌లైట్‌పై దాడికి ఆదేశాలిస్తున్నారు." (లింక్, మార్చి 23)

ఎవరువారు?

భవనానికి నిప్పుపెట్టుచుండగా అరెస్టు చేయబడిన వ్యక్తి ఆనంద మార్గ్‌కు చెందినవాడులా కనిపిస్తున్నాడని సెర్చిలైట్ వ్రాసింది.

తన ఆఫీసుపై మార్చి 28 న కత్తులు చురకత్తులు, కపాలాలతో వచ్చి దాడిచేసిన ఆరుగురు ఆనందమార్గీయులను అరెస్టు చేశామని పాట్నా జిల్లామేజిస్ట్రేటు చెప్పారు. వారు కలకత్తానుండి మార్చి 17న పాట్నాకు వచ్చారు.

బయట పడదలచుకోనటువంటి ఒక ఆర్. యస్. యస్. ప్రముఖుని శరీరంనుండి బుల్లెట్టును బయటకి తీయటానికి పాట్నా మెడికల్ కాలేజి ఆసుపత్రికి చెందిన ఒక సర్జన్‌ను ఎత్తుకపోయినట్లు ఆర్యావర్త్ పేర్కొన్నది. (మార్చి 20)

బీహార్ గుజరాత్ కాదు

వారికి సంబంధించిన పూర్తి సమాచారం ప్రభుత్వంవద్ద వున్నదని లింక్ పత్రిక చెపుతున్నది "కొన్ని విదేశీ సంస్థల సహకారంతో ఆర్. యస్. యస్; యస్ యస్ పి; ఆనంద్‌మార్గ్; కొందరు సిండికేట్ వారు ఆందోళన ప్రారంభమయ్యే మార్చి 18 న గందరగోళం సృష్టించబోతున్నారని ప్రభుత్వానికి అందిన సమాచారం". (మార్చి 23).

కాని వారిని మాత్రం మార్చి 18 కన్నా ముందుగా నిర్బంధంలోకి తీసుకోలేదు మార్చి 18 కి ముందుగానీ, కనీసం ఆ తరువాతనైనాగానీ అరెస్టు చేయలేదు. మార్చి 18 తరువాత కొన్ని రోజులకుగాని వారి ఆఫీసులపై దాడిచేయలేదు. ఈ విధంగా బీహార్ అంతటా లూటీలు, గృహదహనాలకు పాల్పడినవారు తప్పించుకోవటానికి అవకాశమిచ్చారు.

మితవాదుల కుట్ర ఫలించటానికి అబ్దుల్ గఫూర్ నాయకత్వానగల బీహార్ ప్రభుత్వం అనుకూలమైన పరిస్థితి సృష్టించింది. వారి కుట్రలు భగ్నమైనందుకుగాను దక్కవలసిన ఘనత ఏదైనా వుంటే అది ప్రజాస్వామ్య భావాలుగల బీహార్ ప్రజలకు, అన్నిటికన్నా మించి కార్మికవర్గానికీ, మితవాదుల కుట్రను అరికట్టి, ప్రజల వాస్తవమైన ప్రత్యేకంగా విద్యార్థుల డిమాండ్లపై నెరుగా స్వతంత్ర ఉద్యమాలను నడిపి, ఆర్.యస్.యస్. నాయకత్వానగల సంఘర్ష సమితి ఆందోళన వెనుకగల అభివృద్ధి నిరోధక కుట్రను బహిర్గతం చేసినటువంటి అఖిలభారత విద్యార్థి సమాఖ్య మరియు సంఘర్ష మోర్చా నాయకత్వానగల ప్రగతిశీల విద్యార్థులకు దక్కాలి.

బీహార్ గుజరాత్ కాదు. ఎందుచేతననగా కొరత మరియు ధరలు పెరుగుతున్నకొలదీ, అసహ్యకరమైన వృత్తి పన్నుకూ, గఫూర్ మంత్రి వర్గానికీ, మితవాదుల కుట్రకూ వ్యతిరేకంగా విరిచిన ప్రజా ఉద్యమం కార్మికవర్గ నాయకత్వానవుంది. దానికి యితర ప్రజాతంత్ర శక్తుల (ప్రజా మద్దతువుంది. వృత్తి పన్ను విధించగానే బీహారులోని 40 వేల స్థానిక సంస్థల కార్మికులు సమ్మె చేశారు బ్యాంకుఉద్యోగులు నిబంధనల మేరకు పని ప్రారంభించారు ప్రభుత్వం ఈ ప్రయత్నాన్ని వదులుకొని వృత్తిపన్నును ఉపసంహరించుకొన్నట్లు మార్చి 27 న ప్రకటించింది. కార్మికవర్గం సాధించిన ఈ విజయంపై జయప్రకాశ్ ఒక ముక్క కూడా చెప్పలేదు.

అందుకే జయప్రకాశ్ యిపుడు అంత కోపంగా వున్నారు. అందుకే యిపుడు ఆయన శత్రుగడలను మార్చుకొని తన అభివృద్ధి నిరోధక కుట్రలో భాగస్వాములను చేయటానికి టీచర్లను, ప్రొఫెసర్లను ఆకర్షించ ప్రయత్నిస్తున్నారు.

[న్యూయేజ్, ఏప్రిల్ 7]

భార్య ముక్కు, చెవులు కోసిన భర్త

భద్రాచలం, ఏప్రిల్ 12

ఇక్కడకు 15 కిలోమీటర్ల సమీపంలో వున్న వరపాపురం గ్రామానికి చెందిన ఒక వ్యక్తి తన భార్య శీలాన్ని శంకించి, ఆమె ముక్కును, చెవులను, పెదవులను, స్తనాలను కత్తిరించి ఆ గ్రామం నుంచి పరారి అయ్యాడు.

ఈ వ్యక్తి 6 సంవత్సరాల క్రితం వేసెక్టమీ ఆపరేషన్ చేయించుకున్నాడని. తన భార్య గర్భవతి అని తెలిసి ఈ ఘాతుకానికి పూనుకున్నాడని చెప్పబడుతోంది. దీనిపై పోలీసులు దర్యాప్తు జరుపుతున్నారు.

క్రొత్త పార్టీ ఏర్పాటుకు చర్చలు

ఎస్.ఎస్.పి; బి.కె.డిలచే

న్యూఢిల్లీ, ఏప్రిల్ 12

నూతన పార్టీని ఏర్పాటుచేసే సమస్యపై సంయుక్త సోషలిస్టుపార్టీ, భారతీయ క్రాంతిదళ్, సిండికేటు, స్వతంత్రపార్టీ, అకాలీదళ్‌లు నేడిక్కడ ప్రాథమిక చర్చలు జరిపాయి.

సిండికేట్ నాయకులు శ్రీ యస్. యన్. మిశ్రాతో, బి. కె. డి. నాయకులు శ్రీ శ్యామ్‌లాల్‌యాదవ్‌తో శ్రీ రాజనారాయణ్ చర్చలు జరిపారు.

రేపటి చర్చల్లో శ్రీయుతులు కర్పూరి ఠాకూర్ (యస్. యస్. పి.), బిజూపట్నాయక్ (ప్రగతి పార్టీ,) ప్రకాష్‌సింగ్ బాదల్ (అకాలీ), చరణసింగ్ (బి. కె. డి.)లు పాల్గొంటారు.

రేపు సమావేశం అనంతరం శ్రీ చరణ్ సింగ్ పత్రికా గోష్ఠిలో ప్రసంగిస్తారు.

అఖిలభారత స్థాయిలో కాంగ్రెసుకు వ్యతిరేకంగా కమ్యూనిస్టేతర ప్రతిపక్షాన్ని ఏర్పాటుచేసే నిమిత్తం ఈ చర్చలు సాగిస్తున్నారు.

శ్రీ కామరాజ్‌పై క్రమశిక్షణా చర్యలు ?

మద్రాసు, ఏప్రిల్ 12

కాంగ్రెసుతో సంబంధాలు ఉండకూడదన్న సిండికేటు కార్యవర్గం ఆదేశాన్ని ఉల్లంఘించినట్లయితే శ్రీ కామరాజ్‌పైన తమిళనాడ్ సిండికేటుపైన క్రమశిక్షణా చర్యలు తీసుకొనే అవకాశమున్నదని ఇక్కడ రాజకీయ పరిశీలకులు భావిస్తున్నారు

తమిళనాడ్‌లో కాంగ్రెసుతో సంబంధాలను శ్రీ కామరాజ్ వదులుకోబోవచ్చునని తెలుస్తున్నది.

శ్రీమతి ఇందిరాగాంధితో నిన్న శ్రీ కామరాజ్ జరిపిన చర్చలు కార్యవర్గం ఆదేశాన్ని ఉల్లంఘించడమేనని పరిశీలకులు భావిస్తున్నారు.

బంగ్లాదేశ్‌లో పెను తుఫాను

ఢాకా, ఏప్రిల్ 12

బంగ్లాదేశ్‌లోని నర్సింగ్‌ది జిల్లాలో నిన్న సంభవించిన పెనుతుఫానులో దాదాపు 3 వేల గృహాలు ధ్వంసమయ్యాయనీ, అనేకమంది ప్రజలు నిరాశ్రయులయ్యారనీ అధికార వర్గాలద్వారా తెలియవచ్చినట్లు బి. యస్. యస్. వార్తా సంస్థ పేర్కొంది.

దూర ప్రయాణపు బస్సుల తగ్గింపు

రాష్ట్రాలకు ఆదేశం

న్యూఢిల్లీ, ఏప్రిల్ 12

భవిష్యత్‌లో దూర ప్రయాణాల బస్సులను ప్రారంభించవద్దనీ, వీలున్నచోట్ల ప్రస్తుతం నున్న దూర ప్రయాణాల బస్సులను తగ్గించవలెనని నౌకా రవాణా మంత్రిత్వశాఖ రాష్ట్రాలను కోరింది.

ఇందువలన డీజిల్ ఆయిల్ వినియోగం తగ్గించవచ్చనీ, మెట్రో పాలిటన్ నగరాల్లో బస్సులను పెంచటానికి వీలు పడుతుందని తెలిపింది.

బొంబాయి, కలకత్తా, ఢిల్లీ, మద్రాసు నగరాల్లోని బస్ సర్వీసులను మెరుగు పరచుటకు అవసరమైన ప్రత్యేక సహాయాన్ని గురించి ప్రతిపాదనలు ఆ యా రాష్ట్రాలు పంపాలని కోరింది.

1974-75లో మద్రాస్ నగరానికిగాను 288 కొత్త బస్సులను కొనుగోలు చేయడానికై తమిళనాడు ప్రభుత్వం రు. 3 కోట్లు ఆర్థిక సహాయంకొరకు కేంద్రాన్ని కోరడం జరిగింది.

ఈ విషయంలో ఆర్థిక మంత్రిత్వశాఖ అనుకూలతను వెల్లడించినట్లు, త్వరలో నిర్ణయం తీసుకోబోతున్నట్లు అధికార వర్గాలు తెలిపాయి.

అదే విధంగా కలకత్తానగరంలో రవాణా సౌకర్యాలు పెంచటానికి రు 6.85 కోట్ల రుణాన్ని మంజూరు చేయాల్సిందిగా అభ్యర్థన వచ్చింది. అయితే రవాణా సౌకర్యాల అభివృద్ధి చేయటానికై కేంద్రం రు 1.85 కోట్లు ఇవ్వదలచినట్లు అధికార వర్గాలు తెలిపాయి.

సంగీత, నృత్య పాఠ్యాంశాల విస్తరణ

గోష్ఠిలో పలువురి సూచన

విజయవాడ, ఏప్రిల్ 13

సంగీత, నృత్య పాఠ్యాంశాల పరిధిని విస్తరింపచేయాలని, నేడిక్కడ ప్రభుత్వ సంగీత, నృత్యకళాశాలలో జరిగిన ఒక గోష్ఠిలో పలువురు వక్తలు సూచించారు.

ఆంధ్రా యూనివర్సిటీ మాజీ రిజిస్ట్రార్ శ్రీ కె. వి. గోపాలస్వామి గోష్ఠికి అధ్యక్షత వహించారు.

శ్రీ గోపాలస్వామి ప్రసంగిస్తూ, పాఠ్యాంశాల్లో సంగీతం, నృత్యంతోపాటు నాటకాన్ని కూడా చేర్చాలని అన్నారు

విజయవాడ ఆకాశవాణి కేంద్రం డైరెక్టర్ శ్రీ బాలాంత్రపు రజనీ కాంతరావు మాట్లాడుతూ పాఠ్యాంశాలలో హరికథ, యక్షగానం, జానపద నృత్యం, లలిత సంగీతం చేర్చాలని విజ్ఞప్తి చేశారు.

విద్యార్థులకు సంస్కృతం, తెలుగు, హిందీ భాషల్లో తర్ఫీదు ఇవ్వాలని శ్రీ ఎన్. పి. ఆర్. వి. విఠల్ కోరారు.

గోష్ఠిలో రైల్వే డివిజనల్ సూపరింటెండెంటు శ్రీ టి. వి. శ్రీనివాసన్, ఇన్‌కంటాక్సు అసిస్టెంట్ కమిషనర్ శ్రీ పి. సుబ్బారావు, శ్రీ ఎస్. ఎస్. మూర్తి, శ్రీమతి ఎ. కోటేశ్వరమ్మ ప్రభృతులు ప్రసంగించారు.

అంతకు ముందు కళాశాల ప్రిన్సిపాల్ శ్రీ ద్వారం భావనారాయణ స్వాగతం చెప్పారు.

భారత్-అమెరికా సంబంధాల మెరుగు

కిసింగర్ వివరణ

వాషింగ్‌టన్, ఏప్రిల్ 11

భారత్‌తో అమెరికా సంబంధాలు నిర్మాణాత్మకంగా మెరుగుపడ్డాయని. యుద్ధానంతర కాలంలో ఈ సంవత్సరంలో ఉన్నంత మంచిగా ఈ సంబంధాలు గతంలో లేవని అమెరికా విదేశాంగ మంత్రి హెన్రీ కిసింగర్ నేటి రాత్రి ఇక్కడ చెప్పారు

సెనేట్‌లో మెజారిటీపక్ష నాయకుడు మైక్ మాన్స్‌ఫీల్డ్ గౌరవార్థం భారత రాయబారి శ్రీ టి. యన్. కౌల్ ఏర్పాటుచేసిన విందు సందర్భంగా ప్రసంగిస్తూ ఆయన పై విధంగా అన్నారు.

ఆస్ట్రేలియా విదేశాంగ మంత్రి న్యూఢిల్లీ రాక

న్యూఢిల్లీ, ఏప్రిల్ 12

భారత్‌లో 9 రోజులపాటు పర్యటించేందుకుగాను ఆస్ట్రేలియా విదేశాంగమంత్రి డాక్టర్ డూడోర్స్ విల్‌కిన్‌లేజిర్ నేటి రాత్రి ఇక్కడికి వచ్చారు.

కేంద్ర ఆర్థిక మంత్రి శ్రీ వై. బి. చవాన్, విదేశాంగశాఖ స్టేట్ మంత్రి శ్రీ సురేంద్రపాల్‌సింగ్, విదేశాంగ శాఖ అధికారులు ఆయనకు విమానాశ్రయంలో స్వాగతం చెప్పారు.

భార్య, బిడ్డను చంపి ఆత్మహత్యకు పాల్పడిన యువకుడు

కాళికోట్, ఏప్రిల్ 13

కన్ననూరుజిల్లా మత్తన్నూర్ గ్రామంలో శ్రీ పి. గోవిందన్ (33 సం॥) అనే వ్యక్తి తన భార్య శ్రీమతి రోహిణి (23 సం॥)ని, కుమార్తె అజిత (3 సం॥)ను గొడ్డలితో చంపి నరికివేసి తానుకూడా హత్య చేసుకున్నారు. మరొక ఏడుమాసాల బిడ్డ మాత్రం కత్తిపోట్లకు గురై, ప్రాణాలతో బ్రతికి వుంది.

రక్తపు మడుగులో పడివున్న పసిబిడ్డను ఇరుగు పొరుగువారు చూసి హాస్పిటల్లో చేర్పించారు.

గయలో కాల్పులు; 5 గురి మృతి

16 గంటలపాటు కర్ఫ్యూ విధింపు

పాట్నా, ఏప్రిల్ 12

నేడు గయలో అదుపుతప్పిన విద్యార్థి, యువజన సమూహంపై పోలీసులు కాల్పులు జరపగా ఐదుగురు మృతి చెందారని, 15 మంది గాయపడ్డారని నేడిక్కడ అధికార వార్తలు తెలిపాయి

దీనితో ఉద్రిక్తత యేర్పడటంతో పట్టణంలో 16 గంటలపాటు కర్ఫ్యూను విధించారు.

పట్టణంలో మూడుచోట్ల పోలీసులు కాల్పులు జరిపారు.

ప్రభుత్వాన్ని స్తంభింపచేయడానికి రాష్ట్రవ్యాప్తంగా నాలుగు రోజులుగా జరుగుతున్న ఉద్యమంలో భాగంగా నేడు 2 వేల మంది ప్రజలు జిల్లాకార్యాలయాలను ఘెరావ్ చేశారు.

కొత్వాలి టెలిఫోను ఎక్స్చేంజి, తపాలా కార్యాలయంపై దాడి జరిపారు. పోలీసు థ్యానును తగులబెట్టారు.

మధుబనిలో విద్యార్థులు, యువకులు మౌన ప్రదర్శన జరిపారు. మహిళలు ప్రత్యేకంగా ప్రదర్శన జరిపారు.

స్టేట్ బ్యాంకుతో సహా ప్రభుత్వ కార్యాలయాలను విద్యార్థులు ఘెరావ్ చేసిన ఫలితంగా కార్యక్రమాలు జరగలేదు. పట్టణంలోని కళాశాల టీచర్లు కూడా నేడు నిరాహారదీక్షలో చేరారు.

విద్యార్థుల ఆందోళనను బలపరుస్తూ పాట్నా విశ్వవిద్యాలయానికి చెందిన మహిళా టీచర్లు, మహిళా కళాశాల టీచర్లు నేడు కార్యక్రమాలలో పాల్గొన్నారు

15 మంది మహిళా టీచర్లు 12 గంటలపాటు నిరసన వ్రతంలో పాల్గొన్నారు.

పాట్నాలో జిల్లా కలెక్టరు కార్యాలయాన్ని ఘెరావ్ చేయాలని విద్యార్థులు తలపెట్టిన కార్యక్రమం జయప్రదం కాలేదు. ఏదో ఒక విధంగా లోపలికి ప్రవేశించి కలెక్టరు ఆఫీసుగదికి తాళం వేసిన సందర్భంగా ఇద్దరిని అరెస్టుచేశారు. ఇతర ప్రాంతాలలో ప్రభుత్వ కార్యాలయాలను ఘెరావ్ చేయడానికి ప్రయత్నించిన సందర్భంగా 16 మందిని అరెస్టు చేశారు.

విద్యార్థుల ఆందోళనను బలపర్చడానికి న్యాయవాదుల పక్షం నిర్ణయించింది.

వర్తకుల తోడ్పాటు

అధిక ధరలకు వ్యతిరేకంగా విద్యార్థుల ఆందోళనను బలపర్చడానికి దేవఘర్, ఛగేరియాలలోని దుకాణదార్లు, వర్తకులు నిర్ణయించారు.

దేవఘర్‌లో దాదాపు 500 మంది వర్తకులు మూతులు బిగించుకొని, చేతులకు నల్లరిబ్బన్లతో కట్టివేసుకొని మౌన ప్రదర్శన జరిపారు. ఛగేరియాలో కూడ దుకాణదార్లు అలాంటి ప్రదర్శననే నిర్వహించారు,

గ్రామీణ ప్రాంతాలలోని అనేక పంచాయతీ సమితి కార్యాలయాలలో పనులు స్తంభించి పోయాయి.

దిష్టిబొమ్మల దగ్ధం

జెమ్‌షెడ్‌పూర్‌లోని ఒక్కా ప్రాంతంలో విద్యార్థులు ఊరేగింపు జరిపి బీహారు మంత్రుల దిష్టిబొమ్మలను దగ్ధంచేశారు.

విద్యార్థి నాయకుల్లో విభేదాలు

విద్యార్థికార్యాచరణకమిటీనాయకత్వంలో భవిష్యత్తు కార్యాచరణ పైన, లక్ష్యానికి సంబంధించిన అంశాల పైన విభేదాలు ఏర్పడ్డాయి.

లోకసభను రద్దుచేయాలనే డిమాండును విద్యార్థి కార్యాచరణ కమిటీ చేయలేదని పాట్నా యూనివర్శిటీ విద్యార్థి సంఘం అధ్యక్షుడు, కార్యాచరణ కమిటీ సభ్యులు శ్రీ లల్లూప్రసాద్ నేడొక ప్రకటనలో తెలిపారు.

లోకసభ రద్దు డిమాండ్‌ను కొందరు కమిటీ సభ్యులు నిన్న పత్రికాగోష్ఠిలో ప్రకటించారు

అన్ని పార్టీలకు చెందిన శాసనసభ్యులు రాజీనామా చేయాలని పాట్నా యూనివర్శిటీ విద్యార్థి సంఘం ప్రధాన కార్యదర్శి, సహాయ కార్యదర్శులు నేడొక ప్రకటనలో కోరారు.

న్యూస్‌ప్రింట్ సరఫరా

గుజ్రాల్ వివరణ

బొంబాయి, ఏప్రిల్ 12

ఈ సంవత్సరం న్యూస్‌ప్రింట్ సరఫరాకు సంబంధించి ప్రస్తుత పరిస్థితి కొనసాగగలదని భావిస్తున్నట్లు కేంద్ర సమాచార శాఖ మంత్రి శ్రీ ఐ. కె. గుజ్రాల్ నేడిక్కడ చెప్పారు.

బొంబాయి జర్నలిస్టుల యూనియన్ ఏర్పాటు చేసిన పత్రికా సమావేశంలో ప్రసంగిస్తూ ఆయన పైవిషయం తెలిపారు.

ప్రజాస్వామ్యాన్ని కాపాడుకోలేకపోతే పత్రికా స్వాతంత్ర్యం మిథ్యమైపోతుందని, బీహార్, గుజరాత్, తదితర ప్రాంతాల్లో జరిగిన ఘటనలు ప్రజాస్వామ్య వ్యవస్థ పునాదులను బలహీన పరచడానికి ఉద్దేశించినవని ఆయన అన్నారు.

హింసాకాండతో కూడిన ప్రదర్శనల గురించి విలేకరులు గోరంతనికొండంతగా వార్తలు రాయరాదని ఆయన అన్నారు.

ఉధృతస్థాయిలో హింసాకాండ చెలరేగితే ఇక దేశంలో కళ, సంస్కృతి, సృజనాత్మక కార్యకలాపాలు ఏవీ మిగలవన్నారు.

మరో రెండు అగ్నిమాపకదళ కేంద్రాలు

ఢిల్లీ విమానాశ్రయంవద్ద

న్యూఢిల్లీ, ఏప్రిల్ 12

ఢిల్లీ అంతర్జాతీయ విమానాశ్రయంవద్ద ప్రస్తుతమున్న అగ్నిమాపకదళ కేంద్రంతో పాటు మరో రెండు అగ్నిమాపక కేంద్రాల ఏర్పాటు చేయటం జరుగుతుందని ఢిల్లీ ప్రధానఅగ్నిమాపకదళాధికారి శ్రీ ఆర్. ఎన్. సుందరం నేడిక్కడ తెలిపారు.

ఒకటి వసంత విహార్ వద్ద, మరొకటి నజఫ్‌గఢ్‌వద్ద ఏర్పాటు చేయడానికై ఢిల్లీ అభివృద్ధి సంస్థను స్థలాలు సేకరించమని కోరినట్లు తెలిపారు.

ఈ కేంద్రాలకు అవసరమైన పరికరాలను పౌర విమానశాఖ సమకూర్చుతుందని ఆయన తెలిపారు.

ఢిల్లీలో ప్రస్తుతమున్న 13 అగ్నిమాపక దళ కేంద్రాల సంఖ్యను 30 కి పెంచాలని నిర్ణయించబడిందని తెలియచేసారు.

జాతీయ విద్యార్థి యూనియన్ సదస్సు

శ్రీమండలిచే ప్రారంభోత్సవం

మచిలీపట్నం, ఏప్రిల్ 12

ఆంధ్ర, శ్రీ వెంకటేశ్వర యూనివర్శిటీల భారత జాతీయ విద్యార్థి యూనియన్ శాఖల ప్రథమ సదస్సును విద్యామంత్రి శ్రీ యం. వి. కృష్ణారావు నేడిక్కడ ప్రారంభించారు.

మూడు రోజులపాటు జరిగే ఈ సదస్సుకు 500 మంది ప్రతినిధులు హాజరయ్యారు. సదస్సుకు శ్రీ కమలాకరరావు అధ్యక్షత వహించారు.

నూతన సమాజంలో విద్యార్థుల పాత్ర గురించి శ్రీ వి. జె. అగస్టిన్ సదస్సులో వివరించారు.

సమస్యల పరిష్కారానికి సమ్మెలకు పూనుకోవద్దని విద్యామంత్రి విజ్ఞప్తి చేశారు. కళాశాలల్లో బోధనాభాష, యూనివర్శిటీల నిర్వహణ సంస్థలలో విద్యార్థులకు ప్రాతినిధ్యం ఇవ్వటంవంటి సమస్యలపై అభిప్రాయాలను తెలుపవలసిందిగా విద్యార్థులను ఆయన కోరారు.

కాశ్మీర్ ప్రజలకు 'గౌరవప్రదమైన స్థానం'

షేక్ అబ్దుల్లా వెల్లడి

శ్రీనగర్, ఏప్రిల్ 12

కాశ్మీర్ ప్రజలు 'గౌరవ ప్రదమైన స్థానం' సాధించుకోగలుగుతారని తాను ఆశిస్తున్నట్లుగా శ్రీ షేక్ అబ్దుల్లా నేడిక్కడ అన్నారు.

హజరత్ బల్ మసీదులో శుక్రవారంనాడు జరిగిన సభలో ఆయన ప్రసంగిస్తూ గత 21 ఏండ్లుగా పేరుకొనిపోయిన సమస్య త్వరలో పరిష్కారం కాగలదనీ ఆశిస్తున్నానని అన్నారు.

కేంద్ర నాయకులతో జరిపిన చర్చలను దృష్ట్యా తాను ఈ అభిప్రాయానికి వచ్చానని ఆయన అన్నారు.

ఆర్.టి.సి. బస్సులో ఆరువేలు గల్లంతు

గూడూరు, ఏప్రిల్ 13

నిమ్మకాయల వ్యాపారస్థుడు షేక్ మీర్జా ఈనెల 8వ తేదీన నాయుడుపేటకు వెళ్ళటానికి గూడూరు-తిరుపతి బస్సులో ఎక్కి ప్రక్కనున్న ఖాళీసీటుపై డబ్బుల సంచి పెట్టి కండక్టరువద్ద టికెట్టు తీసుకొని తిరిగి చూచేసరికి సంచిమాయమై పోయింది.

సంచిలో ఆరువేల రూపాయలున్నాయి. బస్ స్టాండులో తిరిగే రౌడీ ముఠాలు, జేబుదొంగల వారి మూలంగా ప్రయాణీకులకు చాలా యిబ్బంది కలుగుచున్నది పోలీసులు మాత్రం ఈ రౌడీ ముఠాలపట్ల మెతకగా వ్యవహరిస్తున్నారు.

మద్రాసులో బాష్పవాయువు

మద్రాసు, ఏప్రిల్ 13

గత రాత్రి ఇక్కడ ఘర్షణకు దిగిన రెండు వర్గాల ప్రజలను చెదరగొట్టేందుకు పోలీసులు బాష్పవాయువు ప్రయోగించారు.

హైదరాబాద్‌లో నేడు

పెరుగుతున్న ధరలకు వ్యతిరేకంగా కార్యాచరణను రూపొందించే నిమిత్తం బ్యాంక్ స్ట్రీట్‌లోని సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఆవరణలో సాయంత్రం 5 గంటలకు అన్ని కార్మిక సంఘాల, ఉద్యోగ సంఘాల సమావేశం జరుగుతుంది.

ఫార్వర్డ్‌బ్లాక్ విజ్ఞప్తి

న్యూఢిల్లీ, ఏప్రిల్ 13

జరగబోయే రాష్ట్రపతి ఎన్నికల్లో వామపక్ష ప్రజాతంత్రపార్టీలు ఉమ్మడి అభ్యర్థిని నిలబెట్టడానికి గల అవకాశాలను పరిశీలించాలని ఫార్వర్డ్‌బ్లాక్ నిన్న ఇక్కడ ప్రకటనలో విజ్ఞప్తి చేసింది. పార్టీ కేంద్ర కమిటీ సమావేశంలో పై మేరకు తీర్మానాన్ని ఆమోదించారు.

ANDHRA CHRISTIAN COLLEGE, GUNTUR

The 87 th Anniversary and 2 nd Convocation at the Andhra Christian College, Guntur will be held on Monday, the 15 th April 1974 in the College premises at 4-30 P. M.

The candidates who have registered for receiving the degree in presence are requested to attend the function.

(Sd.) N. ISAAC,
Principal.

టెండరు నోటీసు

గుంటూరు మున్సిపాలిటీ

Rc F2 140/74 తే. 11-4-74

1974-75 సంవత్సరానికి ఈ క్రింది ఐటములు సప్లయిచేయుటకు సీలు వేసిన టెండర్లు 3.5.1974 సాయంత్రం 4 గంటలవరకు తీసుకొనబడి ఆదే రోజు సాయంత్రం 4.30కు కమీషనర్ అండ్ స్పెషల్‌ఆఫీసర్ లేక వారిచే అధికారం పొందిన ఎవరిచేతనైనా ఆఫీసులో టెండర్లు తెరువబడును. టెండరు షెడ్యూళ్ళను మున్సిపల్ హెల్త్ ఆఫీసరునుండి 2.5.1974 మధ్యాహ్నం 1 గంట వరకు అన్ని పనిరోజులలో పొందవచ్చును.

ఇతర వివరాలు పనివేళలలో మున్సిపల్ హెల్త్ ఆఫీసరునుండి పొందవచ్చును. ఎట్టి కారణము తెలుపకనే ఏ ఒక్క టెండరునైనా లేదా అన్ని టెండర్లు నిరాకరించు అధికారము మున్సిపల్ కౌన్సిల్ లేదా కాంట్రాక్టు కమిటీకి కలదు.

వరుస నెం.	సప్లయి చేయవలసిన ఐటమ్ పేరు	టెండరు డిపాజిట్	టెండరు షెడ్యూలు ఖరీదు
1.	కోకోనట్ ఆయిల్ మరియు (501) హౌస్ బార్ సోప్స్	రు. 1,500/-	రు. 15.30

(సం.) యం. ఎ. జబ్బార్
కమీషనర్ & స్పెషల్ ఆఫీసర్

ఏ ఇబ్బంది లేకుండా ప్రయాణం చేయండి!



సెలవులలో మీరు ఎక్కడికైనా వెళ్ళదలచుకుంటే స్టేట్ బ్యాంక్ ట్రావెలర్స్ చెక్కులు తీసుకువెళ్ళండి. మీ డబ్బు దొంగిలించబడుతుంది లేక ప్రమాదవశాత్తూ పోతుందేమోనన్న భయాన్ని దూరంచేసి మీ సెలవులను హాయిగా గడిపేందుకు సహాయపడుతుంది స్టేట్ బ్యాంక్ ట్రావెలర్స్ చెక్. ఒకవేళ వాటిని మీరు పోగొట్టుకుంటే మీ డబ్బు మీకు పూర్తిగా తిరిగి లభిస్తుంది.

స్టేట్ బ్యాంక్ ట్రావెలర్స్ చెక్కులు అన్ని స్టేట్ బ్యాంక్ ఆఫీసులలోనూ మరియు ఇతర ప్రముఖ బ్యాంకులలోనూ కూడా అంగీకరించబడతాయి. అంతేగాక, దేశమంతటా ఈ చిహ్నాన్ని ప్రదర్శించే హోటళ్లు, రెస్టారెంట్లు, షాపులు మొదలైన చోటులలో మీరు వాటిని నగదుగానే ఉపయోగించుకోవచ్చు.



స్టేట్ బ్యాంక్ ట్రావెలర్స్ చెక్ — డబ్బును తీసుకొనివెళ్ళేందుకు ఎంతో సురక్షితమైన, సౌలభ్యమైన మార్గం

స్టేట్ బ్యాంక్

AIYARS-S.470 TE

"లా" సప్లిమెంటరీ పరీక్షలు వాయిదా

వాల్తేరు, ఏప్రిల్ 12

ఈ నెల 15 న జరగవలసిన ఆంధ్రా యూనివర్శిటీ లా సప్లిమెంటరీ పరీక్షలు 29 వ తేదీకి వాయిదా పడ్డాయని యూనివర్శిటీ పరీక్షల అధికారి ప్రకటిస్తున్నారు.

అభ్యర్థులు తమ హాలు టికెట్లను పరీక్ష జరిగే కేంద్రాలలో చీఫ్ సూపరింటెండెంటు నుండి పరీక్షలకు ఐదు రోజుల ముందుగా పొందవచ్చునని తెలియజేస్తున్నారు.

దీర్ఘరోగులకు ఉత్తమసిద్ధవైద్యం
హస్తప్రయోగం, అవయవము చిన్నదగుట, అవసరకాలమందు అసంతృప్తి, శుక్లనష్టం నపుంసకత్వము, ఉబ్బసము, కుష్టు, బొల్లి, చర్మవ్యాధులు కడుపునొప్పి, చెవుడు పోస్టు ద్వారా కూడా చికిత్స చేయబడును.
శ్రీబాలాజీవైద్యశాల, డా॥దేవర
టి.బి. రోడ్, ఫోన్: 551 తెనాలి,
బ్రాంచి: 9-డి శివాజీస్ట్రీట్, మద్రాసు-17

స్త్రీ/పురుష సేల్స్‌మెన్ కావలెను
మా ప్రసిద్ధి చెందిన "జలిందు హెయిర్ టానిక్"కు ఆర్డర్లు బుక్ చేయుటకు సేల్స్‌మెన్ కావలెను. ఇది జుట్టును 15 రోజులలో 1" నుండి 4" వరకు గ్యారంటీగా పెంచుతుంది. చుండ్రు, జుట్టుతల నివారించును. ఆయుర్వేదిక్ ఫార్ములాతో తయారుచేయబడినది. జీతంరు. 400/- లేక 25 శాతం కమీషన్ ఇవ్వబడును. శాంపుల్ బాక్స్. పోస్టేజికొరకు రు. 5/-లు పంపుతూ దరఖాస్తు చేయండి.
KASHMIR SALES,
D-84, Silampur - DELHI-110153.
DAM/74

అట్లాస్ స్పోర్ట్స్ సైకిల్
స్వారీ ఆనందం పొందండి.
క్రీడాసక్తులైన యువకులకు వేగం, సులువైన సవారీకి ఈ అట్లాస్ స్పోర్ట్స్ బైక్ రూపొందించబడినది. అతి శ్రద్ధతో సునాయాసమైన వేగాన్ని ఇచ్చేందుకు దీనిలో ప్రతి భాగం అతి సూక్ష్మ నైపుణ్యంతో కూర్చబడినది పైగా ఎంత అందంగా వుంటుందీ! దేశంలో లేక మీ యిష్టమైన ఏ ప్రదేశంలో నైనా ఈ సైకిల్‌పై వేగంగా స్వారీ చేయండి. అట్లాస్ స్పోర్ట్స్
సైకిల్‌పై ప్రయాణం మీకత్యంత ఉత్సాహం యిస్తుంది. సామర్థ్యం పెంచేందుకు దిగుమతి చేయబడిన 3 స్పీడ్ హబ్బులు స్వల్పమైన అధనపు వెలకే లభించును.
అట్లాస్ భారతదేశంలో ఎక్కువ అమ్మకాలుకల్గిన సైకిల్

ఆపాడు దోమలు పిచ్చెక్కించేశాయి
టార్టాయిస్ మస్కిటో కోయిల్
(TORTOISE MOSQUITO COIL)
మాకు లభించేవరకూ
సరిగ్గా వాడితే
ఎంతో ప్రభావము గలవి.



10 కోయిల్స్ గల ప్యాకెట్లోంచి, ఒక డబుల్ కోయిల్ తీసి కామూలా వుండే వైపు భాగాన్ని రెండు వ్రేళ్ళ మధ్య అదిమి పెట్టి నెమ్మదిగా విడదీశాను.



తలుపులు, కిటికీలు మూసేసి కోయిల్‌ను స్టాండ్‌పై వుంచి. ఓ మూల నేల మీద పెట్టి వెలిగించాను. ఓ ఇరవై నిమిషాలకు దాని యొక్క పొగ వ్యాపించడం ప్రారంభించగానే... నేను ఓ కిటికీ తెరిచాను దోమలు వెంటనే పారిపోయాయి.

మలేరియా, ఫైలేరియా వ్యాధుల నిరోధానికి ఇవి సిఫార్సు చేయబడుతున్నాయి— దోమకాట్ల బాధలు ఇక వుండనేవుండవు. ఒక కోయిల్ గదిలో వారందరి కోసం చాలు...8 గంటలు కాలుతుంది. పిల్లలకు కూడా హానిచేయదు.



ఇలాంటి కోయిల్స్ జపాన్, హాంగ్‌కాంగ్ సింగపూర్, కెనడా దేశాలలో చాలా ప్రసిద్ధికెక్కినవి. ఆశ్చర్యమేముంది... వీటి ధర తక్కువే... కాని ప్రభావం మాత్రం చాలా ఎక్కువే. మాకిప్పుడు దోమల బాధ లేకుండా హాయిగా నిద్రపడుతోంది!
టార్టాయిస్—భారత దేశంలో లభించే ఈ రకపు దోమల నివారిణి ఇదొక్కటే.
ఈ మస్కిటో కోయిల్ ఇప్పుడు మంచి ఫలితాల కోసం అభివృద్ధిపరచబడింది కూడా.





తయారుచేయువారు:
బొంబే కెమికల్స్ ప్రైవేట్ లిమిటెడ్
మానెక్‌జీ వాడియా బిల్డింగ్, 133, మహాత్మా గాంధీ రోడ్, ఫోర్ట్, బొంబాయి 400 001 టెలిఫోన్ : 251970
everest/779/BCL-TL
ఆంధ్రప్రదేశ్‌కు డిస్ట్రిబ్యూటర్లు:
తాడికొండ ఎంటర్‌ప్రైజెస్, కామూరివారి స్ట్రీట్, విజయవాడ-1 (ఎ. పి) టెలిఫోన్ : 74046.

'దురాక్రమణ'కు ఐరాస నిర్వచనం

జెనీవా, ఏప్రిల్ 13

నానాజాతి సమితికి, ఐక్యరాజ్యసమితికి చెందిన అంతర్జాతీయన్యాయవాదులు50ఏళ్లుగా కష్టపడి "దురాక్రమణ"కు రూపొందించిన నిర్వచనం ఎట్టకేలకు నిన్న ఆమోదించబడింది.

అయితే 8 అంశాలున్న ఈ నిర్వచనం పట్ల గూడా కొంతమంది సభ్యులు తమ అభ్యంతరాలున్నాయన్నారు.

జనరల్ అసెంబ్లీ ప్రత్యేక కమిటీ రూపొందించిన ఈ నిర్వచనాన్ని లీగల్ కమిటీ సెప్టెంబర్‌లో పరిశీలించనుంది.

జెనీవా ప్రణాళికకు "విరుద్ధంగా ఒక రాజ్యం ముందుగా సాయుధ బల ప్రయోగానికి తలపడడం" అనేది ఈ నిర్వచనంలోని కీలకమైన భాగం.

"దురాక్రమణ యుద్ధం అంతర్జాతీయ శాంతిపై నేరం. దురాక్రమణ అంతర్జాతీయ బాధ్యతకు దారితీస్తుంది."

"భూభాగాలు యుక్తం చేయడం, దురాక్రమణ ఫలితంగా వచ్చే ప్రత్యేక సౌకర్యాలు తీసుకోవడం చట్టబద్ధంగా గుర్తించబడబోవు" అని తెలిపింది.

అయితే ఈ అంశాలేవీ "బలవంతంగా హక్కులు కోల్పోయిన ప్రజల స్వయం నిర్ణయాధికారం, స్వేచ్ఛా స్వాతంత్ర్యాలకు ఏ విధంగానూ భంగకరంగా ఉండరాదు" అని కూడా ఆ నిర్వచనం పేర్కొంది.

నిర్వచనం ఆమోదంపట్ల అమెరికా ప్రతినిధి వర్గం హర్షం ప్రకటిస్తూ భద్రతా సంఘానికిది మార్గదర్శి కాగలదన్నారు. ప్రస్తుత ప్రపంచ రాజకీయ పరిస్థితికి ఇది ప్రతిబింబమని వారు తెలిపారు.

అగ్నిప్రమాదంలో ముగ్గురి మృతి

బళ్ళారి, ఏప్రిల్ 11

హొస్పేట తాలూకాలోని చిక్కజాజిగనూరులో గత గురువారం ఒక పూరి ఇంటికి నిప్పు అంటుకొనడంతో ఆ ఇంట్లో వున్న ముగ్గురు మృతి చెందారు.

ఆ ఇంట్లో వున్న తల్లి, కూతురు (10 సం.) కొడుకు (6 సం) అగ్నికి ఆహుతైనారు.

వారిని మంటల్లోంచి బయటకు లాగడానికి ప్రయత్నించిన ఒక వ్యక్తి శరీరం కాలిపోయింది. అతన్ని మెడికల్ కాలేజీ హాస్పిటల్లో చేర్పించారు

స్టవ్ కిరోసిన్ పోస్తుండగా ఈ ప్రమాదం జరిగింది, చుట్టుపక్కలనున్న పూరిళ్ళు కూడా దగ్ధమైపోయాయి.

తెనాలిలో పశు ప్రదర్శన

తెనాలి, ఏప్రిల్ 12

ఆంధ్రప్రదేశ్ పశు ప్రదర్శన సంఘం ఆధ్వర్యాన తెనాలిలో జరుగుతున్న పశు ప్రదర్శన పోటీలకు పశు సంవర్ధకశాఖ డైరెక్టర్ శ్రీ బి. ఎస్. సిరాజ్ ప్రారంభోత్సవం చేశారు.

ఈ సందర్భంగా జరిగిన సభలో పశు సంవర్ధకశాఖ డిప్యూటీ డైరెక్టరు శ్రీ వి. నారాయణ్ణరావు జిల్లా పశుగణ శాఖాధికారి డాక్టర్ టి. వి. కామేశ్వరరావు శ్రీ కె. శంకరన్‌లు ప్రసంగించారు.

కృష్ణా, గుంటూరు, కడప, ఒంగోలు జిల్లాలనుండి రైతులు సముత్సాహంతో పోటీలో పాల్గొన్నారనీ, ఆహ్వాన సంఘం అధ్యక్షులు శ్రీ దావులూరి రామమోహనరావు తెలియచేశారు.

పోటీల ఫలితాలు

ఒంటెద్దు లాగుడు పోటీలు:- 6వ సైజు- మొదటి బహుమతి శ్రీ ధూళిపాళ లక్ష్మీకాంతరావు (అనంతవరం), రెండవ బహుమతి శ్రీ నర్రా కృష్ణమోహనరావు (బూతుమల్లి), మూడవ బహుమతి శ్రీ కూనమనేని సాంబశివరావు (సంగుపాలెం గూడెం). 5వ సైజు-మొదటి బహుమతి శ్రీ ఎలమంచలి సర్వేశ్వరరావు(కోలవెన్ను). రెండవ బహుమతి శ్రీ వేమూరి పేరయ్య (ఘంటసాల). మూడవ బహుమతి శ్రీ ధూళిపాళ లక్ష్మీకాంతరావు అనంతవరం), 4 వ సైజు మొదటి బహుమతి శ్రీ దూళ్ళ రత్తయ్య (కొలకలూరు). రెండవ బహుమతి శ్రీ సజ్జా వెంకటేశ్వరరావు (కొల్లూరు, మూడవ బహుమతి శ్రీ ధూళిపాళలక్ష్మీకాంతరావు (అనంతవరం), 3 వ సైజు మొదటి బహుమతి శ్రీవేమూరిగోపాలరావు(ఘంటసాలపాలెం), రెండవ బహుమతి శ్రీ నర్రా రాఘవయ్య మూడవ బహుమతి- తుమ్మల సాంబశివరావు(పెదపల్లి); 2వసైజు మొదటి బహుమతి - శ్రీ గుమ్మడి పిచ్చయ్య రెండవ బహుమతి- శ్రీకారుమంచి రాఘవరావు, (కంతంరాజుగూడెం) మూడవ బహుమతి శ్రీ వేములపల్లి సుబ్బయ్య, (చింతమోదు) 1 వ సైజు మొదటి బహుమతి- శ్రీ వేములపల్లి సుబ్బయ్య చౌదరి. (చింతమోదు) రెండవ బహుమతి - శ్రీ గొంటుముక్కల వెంకట నారాయణ, (బితానగర్) మూడవ బహుమతి శ్రీ తమ్మన రాఘవరెడ్డి.

రెండెడ్ల లాగుడు పోటీలు: 6 వ సైజు. మొదటి బహుమతి శ్రీమైనేని బైరాగిశాస్త్రి(వరాహపురం) రెండవ బహుమతి శ్రీ నర్రా కృష్ణమూర్తి (బూతుమల్లి) మూడవ బహుమతి శ్రీ లింగనేని సూర్యనారాయణ (పాండాలపర్రం) 5 వసైజ్ మొదటి బహుమతి శ్రీ ఎలమంచలి సర్వేశ్వరరావు (కోలవెన్ను) రెండవ బహుమతి శ్రీ తుమ్మల చెంచు కుటుంబరావు (రావికంపాడు) మూడవ బహుమతి శ్రీ జన్నా జగన్మోహన రెడ్డి (ఇంటూరు) 4 వ సైజు మొదటి బహుమతి శ్రీ ధూళిపాళ లక్ష్మీకాంతరావు (అనంతవరం) రెండవ బహుమతి శ్రీ తుమ్మలచెంచు కుటుంబరావు (రావికంపాడు) మూడవ బహుమతి శ్రీ దూళ్ళ రత్తయ్య(కొలకలూరు). 3 వ సైజు మొదటి బహుమతి శ్రీ వేమూరి గోపాలరావు (ఘంటసాల పాలెం) రెండవ బహుమతి శ్రీ వేమూరి రాజేంద్రప్రసాద్(వరాహపురం) 3 వ బహుమతి శ్రీగోగినేని సూర్యనారాయణ(నడింపల్లి) 2 వ సైజు మొదటి బహుమతి శ్రీ గుమ్మడి పిచ్చయ్య (ఎలమర్రు) రెండవ బహుమతి శ్రీ కారుమంచి రాఘవరావు (కోటడరాజు కొండూరు) మూడవ బహుమతి శ్రీ వేమూరి వెంకటేశ్వరరావు (వరాహపురం) 1 వ సైజు మొదటి బహుమతి శ్రీ వేములపల్లి సుబ్బయ్య, రెండవ బహుమతి శ్రీ గొట్టుముక్కల నారాయణ (బితానగర్) మూడవ బహుమతి శ్రీ గొట్టుముక్కల సుబ్బారావు (కొలుమర్రు).

ఇస్లాం యూనివర్శిటీ ఛాన్సలర్‌గా భషాని

ఢాకా, ఏప్రిల్ 11

తంగైల్‌లో ఏర్పరచనున్న ప్రప్రథమ ఇస్లామిక్ యూనివర్శిటీ ఛాన్సలర్‌గా చైనా అనుకూల నేషనల్ అవామీపార్టీ నాయకుడు మౌలానా అబ్దుల్ హమీద్‌ఖాన్ భషాని నియమించబడ్డారు.

ఢాకాకు 90 కిలో మీటర్ల దూరంలో తంగైల్ పట్టణం ఆయన జన్మస్థలం. అక్కడ నిన్ననే ముగిసిన మూడురోజుల ఇస్లాం మహాసభలో పై నిర్ణయం వెల్లడించారు.

చైనా సాహిత్యంలో సోవియట్ వ్యతిరేకోన్మాదం

మాస్కో, ఏప్రిల్ 11

"దురహంకారం, సోవియట్ వ్యతిరేకోన్మాదాన్ని దట్టించిన సాహిత్యాన్ని చైనాలో నేడు ఆకాశాని కెత్తుతున్నారు" అని సోవియట్ రచయితల సంఘ పత్రిక "లిటరటూర్నయా గజెట్" విమర్శించింది.

గత ఏడాది షాంఘైలో రెండు భాగాలుగా ప్రచురించబడిన "ఆన్ ఎక్రాస్‌రోడ్"నవలపై ఎక్కడలేని పొగడ్తలు కురిపిస్తున్నారు. ఇది "కరుడు గట్టిన సోవియట్ వ్యతిరేకోన్మాదానికి ప్రతీక" అని ఆ పత్రిక రాసింది.

ఆసియాకు కూడా సౌమనస్య ఫలితాలు

రక్షణశాఖ ఆకాంక్ష

న్యూఢిల్లీ, ఏప్రిల్ 11

సోవియట్-అమెరికా మధ్య, సోవియట్-యూరప్ దేశాలమధ్య సౌమనస్యంపట్ల భారత రక్షణ మంత్రిత్వశాఖ సంతృప్తి ప్రకటిస్తూ ఆసియాతోపాటు ఇతర విస్తృత ప్రాంతాలకు ఈ సౌమనస్య ప్రయోజనాలు ఎందుకు అందరాదని పేర్కొంది.

రక్షణశాఖ 1973-74 వార్షిక నివేదికను నిన్న పార్లమెంటు సభ్యులకు అందజేశారు.

పాకిస్తాన్‌కు విపరీతంగా ఆయుధ సరఫరా వస్తున్నందునా, "చైనా-పాక్‌లమధ్య సహకారం పెరుగుతున్నందువల్లా" దేశ భద్రత, సమగ్రతపట్ల జాగరూకత అవసరమని హెచ్చరించింది.

ఇండోచైనా, పశ్చిమాసియా ఘటనలవల్ల అగ్రరాజ్యాల సౌమనస్య ఫలితాలు యూరప్‌ను దాటి ఆసియా తదితర ప్రాంతాలకు కూడా విస్తరించడంలేదని రక్షణశాఖ విచారం వెల్లడించింది

అమెరికా, చైనా అనేక యూరప్, పశ్చిమాసియాదేశాలనుండి పాకిస్తాన్ ఆయుధాలు తెప్పించుకుంటోంది.

సీటో కూటమి నుండి పాక్ ఉపసంహరణ ప్రభావం పెద్దగా లేదు. ఎందుకంటే సెంటో కూటమిలో పాక్ చురుగ్గా పని చేయడం ప్రారంభించింది. జాతీయ బడ్జెట్‌లో 50 శాతం సాయుధ దళాలకే కేటాయిస్తోంది. ఇది భారత్ వ్యయానికి మూడింతలుంది. "సైనిక పటుత్వం" గురించి ప్రధాని భుట్టో ఎక్కువ మాట్లాడుతున్నారని ఆ నివేదిక ఆందోళన ప్రకటించింది.

చైనా పథకాలు

"మన సరిహద్దు ఉత్తరాన చైనాలో అంతరంగిక కల్లోలం గురించి వార్తలొస్తున్నాయి. అయితే చైనా ఆయుధాల అభివృద్ధి మాత్రం సాగుతోంది. 1973 జూన్ 27 న లాప్‌నార్ ప్రాంతంలోని 15వ అణ్వాయుధ ప్రయోగం ఒకటి రెండు మెగా టన్నుల అణుధార్మిక శీర్షముగా ఉంది

భారత్ సరిహద్దువద్ద, టిబెట్‌లో లక్షకు పైగా సైన్యాన్ని చైనా ఉంచింది.

గ్రామీణ యువకుల శక్తిసామర్థ్యాల తక్షణ వినియోగం అవశ్యకత

ఫక్రుద్దీన్ ప్రసంగం

న్యూఢిల్లీ, ఏప్రిల్ 12

గ్రామీణ యువజనుల శక్తిని సకాలంలో సక్రమ పద్ధతులలో వివిధ రంగాలలో వినియోగించుకోవలసిన అవశ్యకత కలదని కేంద్ర వ్యవసాయ మంత్రి శ్రీ ఫక్రుద్దీన్ అలీ అహమ్మద్ నొక్కిచెప్పారు.

ఎకేఫ్ ఏర్పాటు చేసిన గ్రామీణ ప్రాంతాల యువకుల లీడర్‌షిప్ ట్రైనింగ్ వర్క్‌షాపును ప్రారంభిస్తూ ఆయన పై విధంగా చెప్పారు. ఈ వర్క్‌షాపు రెండు వారాలు జరుగుతుంది. ప్రస్తుతం వున్న సాంఘిక వ్యవస్థపట్ల యువకులు విసుగు చెంది ఉన్నారని ఆయన అన్నారు.

యువకులలో అసంతృప్తి ప్రపంచ వ్యాపిత సమస్యగా వుందనీ, భౌగోళిక, జాతీయత, సాంఘిక సరిహద్దులు దీనికి లేవనీ అన్నారు. వారు తమ అశాంతిని వివిధ పద్ధతులలో వ్యక్తం చేస్తున్నారనీ, కొన్ని పరిస్థితులలో హింసాపూరిత చర్యలకు, సంఘ వ్యతిరేక చర్యలకుకూడా తల పడుతున్నారని ఆయన అన్నారు.

ఆగ్నేయాసియాలోని వివిధ ప్రాంతాలలో నివసించే గ్రామీణ ప్రాంతాల యువకుల సమస్యలలో సారూప్యత కలదని ఆయన చెప్పారు. తక్షణం వారి సమస్యల పరిష్కారానికి అవసరమైన చర్యలను రూపొందించాలని కూడా ఆయన చెప్పారు.

న్యూఢిల్లీలో బంగ్లా చలన చిత్రోత్సవం

న్యూఢిల్లీ, ఏప్రిల్ 12

బంగ్లాదేశ్ చలన చిత్ర వారోత్సవం ఈ నెల 25 న ఢిల్లీలో ప్రారంభంకానుంది.

ఆ రోజు విజ్ఞాన భవన్‌లో కేంద్ర సమాచార ప్రసార మంత్రి శ్రీ గుజ్రాల్ ఉత్సవానికి ప్రారంభోత్సవం చేస్తారు. తర్వాత ఈ చిత్రోత్సవం కలకత్తా, డార్జిలింగ్, గౌహతి, అసన్‌సోల్, భువనేశ్వర్, రాంచీలలో జరుగుతుంది.

రాష్ట్రాలకు స్వయం పరిపాలనాధికారాలు

మణిపూర్ ముఖ్యమంత్రి ప్రకటన

కలకత్తా, ఏప్రిల్ 11

ప్రస్తుతంవున్న వ్యవస్థ తగినట్లుగా లేనందున, రాష్ట్రాలకు మరింతగా స్వయం పరిపాలనాధికారాలు యివ్వాలని మణిపూర్ ముఖ్యమంత్రి శ్రీ మహమ్మద్ అలీముద్దీన్ నిన్నిక్కడ చెప్పారు.

రాష్ట్రాలకు ఎక్కువ స్వయంపరిపాలనాధికారాలు యివ్వాలనేది తమ పార్టీ కార్యక్రమంలో భాగమనీ, తమ పార్టీతో సంప్రదించి, తమ ప్రభుత్వం ఆ సమస్యను చేపట్టవచ్చని వుందని అలీముద్దీన్ ఢిల్లీ వెళుతూ, డమ్‌డమ్ విమానాశ్రయంలో పత్రికల వారితో చెప్పారు.

రాష్ట్రాలకు ఎక్కువగా స్వయం పరిపాలనాధికారాలు యివ్వాలని కోరుతున్న తమిళనాడు ముఖ్యమంత్రి శ్రీ కరుణానిధిని కలుసుకుంటారా? అని ప్రశ్నించగా, ఈసమస్యపై ఆయనను ఎప్పుడో ఒక సారి కలుసుకుని చర్చిస్తానని అన్నారు.

సైన్స్ కోర్సుల పునర్వ్యవస్థీకరణ

ఢిల్లీ గోష్టిలో సూచన

న్యూఢిల్లీ, ఏప్రిల్ 12

అండర్ గ్రాడ్యుయేట్, గ్రాడ్యుయేట్, స్థాయి సైన్స్ కోర్సులను సమూలంగా పునర్ వ్యవస్థీకరించాలని ప్రముఖ విద్యావేత్తలు సూచించారు.

"విజ్ఞానశాస్త్ర విద్యా సమస్యలు" అనే అంశంపై జరిగిన గోష్టిలో పాల్గొంటూ వారు పైవిధంగా సూచించారు.

యూనివర్శిటీ గ్రాంట్స్ కమిషన్ అదనపు కార్యదర్శి శ్రీ డి. శంకరనారాయణ్ ప్రసంగిస్తూ ప్రస్తుత సైన్స్ కోర్సులవల్ల ఉన్నత విద్యకు వెళ్ళే ఒకశాతం మందికి మాత్రమే వుపయోగం వుంటున్నదని మిగతా వారికి నిష్ప్రయోజనకరంగా వున్నదని అన్నారు.

ఉపాధ్యాయులు బోధించిన విషయాన్ని జ్ఞప్తికి వుంచుకోడానికే విద్యార్థులు తమ కాలాన్ని వెచ్చిస్తున్నారని సొంతంగాకల్పనా శక్తిని అభివృద్ధి పరచుకునే అవకాశమే లభించడం లేదని ఆయన అన్నారు.

40 మంది విద్యావేత్తలు గోష్టిలో పాల్గొన్నారు.

బోధనా పద్ధతుల్లో, పరీక్షల నిర్వహణలో తీవ్రసంస్కరణలు ప్రవేశ పెట్టాలని వర్తమాన పరిస్థితులకు అనుగుణంగా సైన్స్ కోర్సులను పునర్‌వ్యవస్థీకరించాలని వారు సూచించారు.

రాష్ట్రంలో మరో 13 కంపెనీలు నమోదు

హైదరాబాద్, ఏప్రిల్ 13

ఆంధ్రప్రదేశ్‌లో మార్చినెలలో రు 14120 లక్షల అనుమతి పొందిన వాటాధనంతో కొత్తగా 13 కంపెనీలు నమోదు అయ్యాయి. వీటిలో రెండు పబ్లిక్ లిమిటెడ్ కంపెనీలు, 11 ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీలు.

కందుకూరి 125 వ జయంతి ఉత్సవాలు

హైదరాబాద్, ఏప్రిల్ 13

ప్రముఖ సంఘ సంస్కర్త, రచయిత శ్రీ. శే. కందుకూరి వీరేశలింగం పంతులు 125 వ జయంతి ఉత్సవాలు జరపడానికి రాష్ట్ర స్థాయిలో ప్రభుత్వం ఒక కమిటీ ఏర్పాటు చేసింది

విద్యాశాఖ మంత్రి శ్రీ ఎం. వి. కృష్ణారావు, సహకారశాఖ మంత్రి శ్రీ బి. సుబ్బారావు, మహిళా సంక్షేమ మంత్రి శ్రీమతి లక్ష్మీదేవి మరో 30 మందితో కమిటీ ఏర్పాటైంది. శ్రీ డి. మాణిక్కొండయ్య ప్రధాన కార్యదర్శిగా వ్యవహరిస్తారు

ఈ నెల 16 నుంచి మే 27 వరకు రాష్ట్ర వ్యాప్తంగా కందుకూరి జయంతి ఉత్సవాలు జరపాలని కమిటీ ప్రథమ సమావేశంలో నిర్ణయించింది. రాజమండ్రిలో ఉత్సవాలు ప్రారంభించి హైదరాబాద్‌లో ముగించాలని నిర్ణయించారు.

కొండపాటూరుకు ప్రత్యేక బస్సులు

విజయవాడ, ఏప్రిల్ 12

కొండపాటూరు పోలేరమ్మ జాతర సందర్భంగా ఆర్. టి. సి. గుంటూరు డివిజన్ ప్రత్యేక బస్సులు నడుపుతున్నది.

గుంటూరు, పెదనందిపాడు, ప్రత్తిపాడు, పొన్నూరు, బాపట్ల, చందోలు, కర్లపాలెం, తెనాలి. రేపల్లె, ఎర్రూరు, చీరాల, ఇంకొల్లు, ఇనుకుర్తిపాడు, చిలకలూరిపేటలనుంచి ఈ నెల 15, 17 తేదీలలో కొండపాటూరికి ప్రత్యేక బస్సులు నడుపుతారు.

నైజీరియాకు సంచార పాఠశాలలు

మిన్‌స్క్, ఏప్రిల్ 12

బైలో రష్యారాజధాని అయిన మిన్‌స్క్ నగరంనుంచి నైజీరియాకు రెండు అసాధారణమైన మోటారు వాన్‌లు పంపబడ్డాయి. అవి సంచార పాఠశాలలు. అందులో సోవియట్ నిర్మిత "మాజ్" రకం ట్రక్కుల డిజైనుగురించి తెలిపే పటాలు, పాఠ్య పుస్తకాలు, ఇతర బోధనా పరికరాలు వగైరా వున్నాయి. ఈ సంచార పాఠశాలలో ఉపాధ్యాయులుగా పనిచేసే ఇంజనీర్లు, మెకానిక్కులు నైజీరియన్ మోటారు డ్రైవర్లకు ఆ రకం ట్రక్కులను నడపడంలోను, రిపేర్లు, సర్వీసింగ్ చేయడంలోనూ శిక్షణనిస్తారు. కొత్తగా స్వాతంత్ర్యం పొందిన యీ ఆఫ్రికన్ రిపబ్లిక్‌లోని మోటారు రవాణా సంస్థలన్నింటికీ వారు వెడతారు.

సోవియట్ నిర్మితమైన యీరకం ట్రక్కులను కొనుగోలు చేసిన దేశాలన్నిటికీ యీ సంచార పాఠశాలలను పంపడమన్నది మిన్‌స్క్ మోటారు కర్మాగారానికి ఒక సంప్రదాయం.

త్వరలో!
ఇండియాలో 20లక్షలమంది సుఖవ్యాధులవల్ల, ఎందుకు బాధపడుతున్నారు! నగ్నంగా చూపిన చిత్రం!
గుప్త జ్ఞాన్
రతి విజ్ఞానం కలర్-హిందీ


రండి! మీరు కోరినవన్నీ ఇచ్చి వినోదం అందిస్తా!
ఈనెల 19న వస్తున్నాను!
మనోరంజన్ కోసం జీనత్ అమన్ స్వయంగా రమ్మని పిలుస్తోంది!
సంజీవ్‌కుమార్ షమ్మీకపూర్
మనోరంజన్

సీడెడ్ : రత్నా పిక్చర్స్

మీరు సైకిలుత్రొక్కి పనికి పోయి వచ్చేందుకు మీరు 100గ్రాముల గ్లూకోస్ కోల్పోతారు!



మీరు కోల్పోయే శక్తిని గ్లాక్సోస్-డి భర్తీ చేస్తుంది
పని సమయాల్లోనే గాక ఇతర వేళల కూడా మీరు చాలా శ్రమించ వలసి ఉంటుంది. ఈ అదనపు శ్రమ కోసం అదనపు శక్తి కావాలి.
గ్లాక్సోస్-డి మీకు అదనపు శక్తి నిస్తుంది. ఇది తీపైనది, రుచి కలది.
మీరు అలసట చెందినపుడు కాఫీలోగాని లేక యథాతథంగా రెండు చెంచాల గ్లాక్సోస్-డి తీసుకోండి. వెంటనే నూతన శక్తి పొందగలరు.
గ్లాక్సోస్-డి®
తక్షణ శక్తి కోసం
dCP/GL/24 tel


విటమిన్ డి, కాల్షియం ఫాస్ఫేట్ మరియు గ్లైసెరోఫాస్ఫేట్‌తో శక్తివంతం చేయబడింది

విశాలాంధ్ర విజ్ఞానసమితి తరఫున ప్రింటర్ అండ్ పబ్లిషర్ : టి. వెంకటేశ్వరరావు, ఎడిటర్ : సి. రాఘవాచారి, ముద్రణ: స్వతంత్ర ఆర్ట్ ప్రింటర్స్, విజయవాడ-520004. R. No. 1138/57